



కేంద్ర మంత్రి రాజనాథ్‌సింగ్ నుంచి మినీరత్న సర్టిఫికెట్ అందుకుంటున్న షిప్‌యార్డు సీఎండీ గిరిదీప్ సింగ్

షిప్‌యార్డుకు మినీరత్న

- కేంద్ర మంత్రి చేతులమీదుగా సర్టిఫికెట్ ప్రదానం

మల్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ హిందుస్థాన్ షిప్‌యార్డుకు మినీరత్న హోదా లభించిన విషయం తెలిసిందే. ఈ మేరకు సోమవారం న్యూఢిల్లీలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో డిఫెన్స్ పీఎస్‌యూ భవన్ ప్రారంభోత్సవానికి హాజరైన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మినీరత్న సర్టిఫికెట్‌ను షిప్‌యార్డు సీఎండీ గిరిదీప్‌సింగ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గిరిదీప్‌సింగ్ మాట్లాడుతూ షిప్‌యార్డుకు మినీరత్న హోదా రావడం గర్వకారణమన్నారు. ఆవిష్కరణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రహించడం, స్వావలంబన, నౌకా నిర్మాణం ద్వారా సముద్ర శిక్షణ తయారీ సామర్థ్యాలను బలోపేతం చేయడానికి షిప్‌యార్డు కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు షిప్‌యార్డు అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నగర నేతలు

- నాగవంశం, నగర/ఉప్పర, కళింగ కోమటి/కళింగ వైశ్య సంక్షేమం, అభివృద్ధి బోర్డుల్లో పలువురికి స్థానం

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కార్పొరేషన్లకు డైరెక్టర్లుగా జిల్లాకు చెందిన పలువురికి అవకాశం లభించింది. నాగవంశం సంక్షేమం, అభివృద్ధి బోర్డు డైరెక్టర్లుగా భీమిలికి చెందిన అప్పికొండ అనంత్‌కుమార్ (జనసేన), గాడు సన్యాసినాయుడు, సురాల సత్యవరప్రసాద్ (టీడీపీ), తూర్పు నియోజకవర్గానికి చెందిన గాడు అప్పలనాయుడు (టీడీపీ), దక్షిణ నియోజవర్గానికి చెందిన డోకర రమణ (టీడీపీ) నియమితులయ్యారు. నగర/ఉప్పర సంక్షేమం, అభివృద్ధి బోర్డు డైరెక్టర్లుగా గంటా సత్యనారాయణ (బీజేపీ), గుర్రం నూకరాజు (గాజువాక), కళింగ కోమటి/

... మిగతా 6వ పేజీలో

దేదీప్యమానం

- సాగరతీరాన ఘనంగా కార్తీక దీపోత్సవం

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్కే బీచ్‌రోడ్డులో గల ఎంజీఎం మైదానంలో సోమవారం సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త సారథ్యంలో కార్తీక దీపోత్సవం దేదీప్యమానంగా జరిగింది. అజ్ఞానాన్ని తొలగించడానికి ప్రతీకగా నిలిచే దీపాన్ని పరబ్రహ్మ స్వరూపంగా భావిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొని దీపాలు వెలిగించారు. ఐదువేల మందికి టికెట్లు విక్రయించగా అంతకు మించి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, మేయర్ పీలా శ్రీనివాసరావు, టీటీడీ స్థానిక కమిటీ చైర్మన్ పట్టాభిరామ్ తదితరులు హాజరయ్యారు.



కార్తీక దీపోత్సవంలో భారీ సంఖ్యలో పాల్గొన్న మహిళలు



వెంకటేశ్వర స్వామివారి ఉత్సవ విగ్రహాలు

ఐటీ సిటీ

విశాఖకు పరిశ్రమల వెల్లువ

- రుషికొండ, కాపులుప్పాడ ప్రాంతాల్లో క్వార్క్స్ టెక్నో సాఫ్ట్, మదర్‌సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్, ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థలకు భూములు
- రుషికొండ ఐటీ హిల్ నంబర్ 3పై ఐటీ, ఐటీ సేవలకు సంబంధించిన కార్యాలయాలు నిర్మించనున్న రహేజా
- 27.1 ఎకరాలు కేటాయింపు
- రూ.2,200 కోట్ల పెట్టుబడితో 30 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్న విశాఖ రియాల్టీ లిమిటెడ్ సంస్థ
- నగరంలో జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్ ఏర్పాటుకు ఓకే
- రియల్‌టైమ్ గవర్నెన్స్, డిజిటల్ పాలనపై సింగపూర్‌తో ఎంఓయూ
- రాష్ట్ర మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గం విశాఖపట్నానికి సంబంధించి సోమవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనేక ఐటీ సంస్థలకు జిల్లాలో భూముల కేటాయింపునకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులే కాకుండా ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయని ప్రకటించింది. ఆ వివరాలు...

విశాఖ రియాల్టీ లిమిటెడ్ సంస్థ రూ.2,200 కోట్ల పెట్టుబడితో 30 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనుంది. ఈ సంస్థ ఐటీ, గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల పాలసీ కింద సుమారు 30 లక్షల చ.అ. విస్తీర్ణంలో గ్రేడ్-1 ఐటీ పార్కును అభివృద్ధి చేస్తుంది. మూడు దశల్లో పనులు జరుగుతాయి. ఎక్కడ భూమి కేటాయించారనే విషయం ప్రస్తావించలేదు. కాకపోతే ఆ ప్రాంతంలో ఉన్న 80 అడుగుల రహదారిని 100 అడుగులకు విస్తరించడానికి కూడా అనుమతులు ఇస్తున్నట్టు ప్రకటించారు.



రుషికొండ ఐటీ హిల్స్

- రహేజా కార్పొరేట్ రియల్ ఎస్టేట్ సంస్థకు రుషికొండ ఐటీ హిల్ నంబర్ 3పై 27.1 ఎకరాల భూమిని కేటాయించారు. ఎకరా భూమి కేవలం 99 పైసలకే ఇచ్చారు. అందులో ఐటీ, ఐటీ సేవలకు సంబంధించిన ఆఫీసులతో పాటు రెసిడెన్షియల్‌కు అనువుగా నిర్మాణాలు చేపడుతుంది. వాస్తవంగా 9,681 మందికి ఉద్యోగాలు ఇవ్వాలని ఒప్పందం కాగా, భూమి ప్రోత్సాహం కింద 15 వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చింది.
- ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్‌కు విశాఖలో 10.29 ఎకరాలు కేటాయించారు. దాని లీజును 33 ఏళ్ల నుంచి 99 ఏళ్లకు పెంచారు. అందులో జీసీసీ (గ్లోబల్ కేపబులిటీ సెంటర్) అభివృద్ధి చేయనుంది.
- క్వార్క్స్ టెక్నో సాఫ్ట్ అనే సంస్థ ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు ముందుకు రాగా వారికి నాలుగు ఎకరాలు కేటాయించారు. రాయితీ ధరతో ఇచ్చారు. క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాలలో రెండు వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి.
- విశాఖకు చెందిన ఫ్లూయెంట్ గ్రిడ్ సంస్థకు కాపులుప్పాడ సర్వే నంబరు 401లో 3.3 ఎకరాల భూమి కేటాయించారు. అక్కడ ఎకరా రూ.30 కోట్లు కాగా వారికి ఎకరా రూ.2 కోట్లు చొప్పున ఇచ్చారు. అందులో రూ.150 కోట్లు పెట్టుబడి పెట్టి రెండు వేల మందికి ఉద్యోగాలు ఇస్తామని ఒప్పందం చేసింది. అందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అడ్వాన్స్‌డ్ ఐటీ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.
- మదర్‌సన్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్‌కు కాపులుప్పాడ ఐటీ పార్కులో 3.55 ఎకరాలు ఎకరా కేవలం 99 పైసలకే కేటాయించారు. అందులో ఐటీ ఆర్ అండ్ డి సెంటర్, జీసీసీ ఏర్పాటు చేస్తారు. రూ.109.73 కోట్ల పెట్టుబడితో 700 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.
- ఐస్పేస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థకు రుషికొండ ఐటీ పార్కు హిల్ నంబర్2పై రెండు ఎకరాల భూమి కేటాయించారు. అందులో 4.59 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఐటీ క్యాంపస్ అభివృద్ధి చేస్తుంది. దానికి రూ.119.18 కోట్లు పెట్టుబడి పెడుతుంది. అందులో రెండు వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఎకరా రూ.4 కోట్లకే కేటాయించడం గమనార్హం.
- అనకాపల్లిలో

... మిగతా 6వ పేజీలో

క్లాప్ కాంట్రాక్టర్‌పై కొరడా

లోడర్లకు వేతనాలు చెల్లించే బాధ్యతల నుంచి ఉద్వాసన

- ఇకపై జీవీఎంసీ టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని కమిషనర్ ఆదేశం
- తక్కువ మందిని పనిలో పెట్టుకుని, ఎక్కువ మందిని చూపిస్తున్నట్టు విచారణలో నిర్ధారణ
- క్లాప్ వాహనాల నిర్వహణపైనా త్వరలో చర్యలు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహనాల కాంట్రాక్టర్‌ను లోడర్లకు వేతనాలు ఇచ్చే బాధ్యత నుంచి తప్పించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ నిర్ణయించారు. వాహనాలకు చెత్తను లోడు చేసేందుకు తక్కువ మందిని పనిలో పెట్టుకుని, ఎక్కువ మందిని చూపిస్తూ జీవీఎంసీ నుంచి భారీగా దోపిడీకి పాల్పడినట్టు నిర్ధారణ కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. లోడర్లకు ఇకపై మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా వేతనాలు అందజేయాలని ఆదేశిస్తూ ప్రజారోగ్య విభాగం అధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

క్లాప్ వాహనాల ద్వారా ఇంటింటికీ చెత్తసేకరణ సరిగా జరగడం లేదని, తక్కువ మందిని పనిలో పెట్టుకుని పూర్తిస్థాయిలో చేస్తున్నట్టు చూపిస్తూ జీవీఎంసీ నుంచి బిల్లు పొందుతుండడంపై గత నెల 19న 'చెత్తసేకరణలో దోపిడీ' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించింది. దీనిపై కమిషనర్ కేతన్‌గార్గ్ విచారణ జరిపించగా...చాలా వార్డుల పరిధిలో క్లాప్ వాహనాలు సరిగా చెత్తసేకరణ చేయడం లేదని, రికార్డుల్లో చూపించిన సిబ్బందిలో 20 శాతం మంది మాత్రమే క్షేత్రస్థాయిలో ఉంటున్నారని నిర్ధారణ అయింది. జీవీఎంసీ పరిధిలో 600కిపైగా లోడర్లు ఉండాలి. ఒక్కో క్లాప్ వాహనం వెనుక ఒకరు వెళ్లి ఇంటి నుంచి చెత్తను తీసుకుని వాహనంలో వేయాలి. ఇందుకోసం లోడర్‌కు రోజుకు రూ.450 చొప్పున కాంట్రాక్టర్ ద్వారా జీవీఎంసీ చెల్లిస్తోంది. అయితే జీవీఎంసీ పరిధిలో 200కి మించి లోడర్లు పనిచేయడం లేదని ప్రజారోగ్యశాఖ అధికారులకు తెలిసినా ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తూ వచ్చారు. దీంతో కాంట్రాక్టర్ దోపిడీకి అడ్డులేకుండా పోయింది. ఇదిలావుండగా 22వ వార్డు పరిధిలో ఏడుగురు లోడర్లు పనిచేయాల్సి ఉండగా, ఇద్దరితోనే పనిచేయిస్తూ, ఏడుగురి పేరిట 18 నెలలపాటు బిల్లు డ్రా చేసినట్టు ఆ వార్డు కార్పొరేటర్ పీతల




... మిగతా 6వ పేజీలో

పెట్టుబడుల సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు

- రేపు సాయంత్రంకల్లా పూర్తికావాలి
- 12వ తేదీ రాత్రికి నగరానికి చేరుకోనున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు
- 13న సీఐఐ, రాష్ట్ర అధికారులతో భేటీ
- 14న ఉపరాష్ట్రపతి, గవర్నర్ రాక
- కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్





ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సీఐఐ సదస్సుకు ఏర్పాటు చేసిన టెంట్లు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో 14, 15 తేదీల్లో జరగనున్న భాగస్వామ్య సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లు ఈనెల 12వ తేదీ సాయంత్రానికి పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. ఎక్కడా ఎటువంటి సమన్వయ లోపం లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సదస్సుకు రెండు రోజులు ముందుగా అంటే...ఈనెల 12వ తేదీ రాత్రికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నగరానికి చేరుకుంటారన్నారు. ఆ మరుసటిరోజు 13వ తేదీన సీఐఐ ప్రతినిధులు, రాష్ట్ర అధికారులతో సీఎం ప్రత్యేకంగా భేటీయి ప్రాథమిక స్థాయి సమావేశాలు నిర్వహిస్తారని, సాయంత్రం అతిథులతో కలిసి గాలా డిన్నర్‌లో పాల్గొంటారన్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పటిష్టమైన ఏర్పాట్లుచేయాలన్నారు. సదస్సులో భారత ఉపరాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు భాగస్వామ్యులు కానున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. సాధ్యమైనంత వరకు డెలిగేట్లకు కిట్లు రిజిస్ట్రేషన్ సమయంలోనే అందజేయాలన్నారు. స్పాట్ రిజిస్ట్రేషన్లు ఉండవని స్పష్టం చేశారు. శంకుస్థాపనలకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లుచేసుకోవాలన్నారు. వీఐపీ, వీవీఐపీల ప్రవేశం, నిష్క్రమణ ద్వారాలు ఏర్పాటుచేయాలన్నారు. నిరంతరం విద్యుత్, ఇంటర్‌నెట్ సదుపాయం కల్పించాలని చెప్పారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు సంప్రదాయ, సాంస్కృతిక నృత్యాలతో ఆత్మీక స్వాగతం పలికేలా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని విభాగాల అధికారులు 12వ తేదీ సాయంత్రానికి ఏర్పాట్లు పూర్తిచేసి, ట్రయల్ రన్ నిర్వహించాలని సూచించారు. కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, పోలీస్ అధికారులు భద్రతాపరమైన చర్యల్లో అప్రమత్తంగా

... మిగతా 6వ పేజీలో

మార్గశిర ఉత్సవాలకు పీఓఎస్ మెషీన్ల ద్వారా టికెట్లు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మీ అమ్మవారి మార్గశిర ఉత్సవాల్లో దర్శనాలకు వచ్చే భక్తులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన పీఓఎస్ మిషన్ల ద్వారా టికెట్లు విక్రయించనున్నారు. దీనికి దేవదాయ శాఖ కమిషనర్ సోమవారం ప్రత్యేక అనుమతులు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్గశిర మాసం గురువారాల్లో వేలాది మంది భక్తులు వస్తారు. వారికి కౌంటర్లలో మాన్యువల్‌గా టికెట్లు ఇవ్వడం ఇబ్బందికరమని ఈఓ తెలియజేయడంతో పారదర్శకంగా ఉండేలా ఎస్‌బీఐ పీఓఎస్‌లను ఉచితంగా వాడుకోవాలని సూచించారు. వీటిని ఈ నెల 21 నుంచి వచ్చే నెల 19వ తేదీ వరకు మాత్రమే అనుమతిస్తారు. వీటికి డిజిటల్ పేమెంట్లు చేయవచ్చును.

ఆన్‌లైన్‌లో టికెట్లు

ఈ ఏడాది ప్రత్యేక పూజల టికెట్ ధరలు భారీగా పెంచేశారు. గురువారాల్లో నిర్వహించే విశేష పంచామృత అభిషేకం టికెట్ ధర గత ఏడాది రూ.7,500 ఉండగా ఇప్పుడు రూ.10 వేలు చేశారు. సాధారణ రోజుల్లో పంచామృత అభిషేకం టికెట్ రూ.2,500 ఉండగా దానిని రూ.3 వేలు చేశారు. విశిష్ట దర్శనం టికెట్ రూ.500గా నిర్ణయించారు. వీటిని ఆన్‌లైన్‌లో బుక్ చేసుకోవచ్చు. వాట్సాప్ గవర్నెన్స్ నంబరు 9552300009 ద్వారా బుక్ చేసుకోవచ్చు.

ఢిల్లీ పేలుళ్లతో అప్రమత్తం

- నగరంలో వాహనాల తనిఖీ
- లాడ్జీలు, హోటళ్లలో కూడా....



త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

మద్దిలపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) ఢిల్లీ పేలుళ్లతో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ఈ మేరకు నగరంలో పోలీసులు సోమవారం రాత్రి నాకాబందీ నిర్వహించారు. జాతీయ రహదారిపై ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, గురుద్వారా, అక్కయ్యపాలెం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం, ఎన్ఏడీ జంక్షన్ల వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఏసీపీల పర్యవేక్షణలో రాత్రి ఎనిమిది గంటల నుంచి వాహనాలను, ముఖ్యంగా కార్లను నిలిపి డిక్కీ, లోపల క్షుణ్ణంగా పరిశీలించారు. నగరంలోని ఆర్టీసీ బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్‌లో మెటల్ డిటెక్టర్లు, బాంబు/డాగ్ స్క్వాడ్‌ల సహాయంతో ప్రయాణికుల లగేజీలను తనిఖీ చేశారు. ఈనెల 14, 15 తేదీల్లో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో సీఐఐ సమ్మిట్ నిర్వహించనున్న నేపథ్యంలో మద్దిలపాలెం, త్రీటౌన్ జంక్షన్‌లలో వాహనాలను అణువణువూ పరిశీలించారు. అలాగే లాడ్జీలు, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు, కార్గో సర్వీస్ సెంటర్‌లు, కొరియర్ కార్యాలయాలను పరిశీలించారు. అనుమానితులను, ఇతర ప్రాంతాల నుంచి బ్యాగులతో వచ్చేవారిని సైతం ఆపి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల డీసీపీ-1 పర్యవేక్షణలో ఏసీపీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి నగర ప్రజలకు కీలక విజ్ఞప్తి చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలు కనిపిస్తే వెంటనే 112,94933 36633 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కిటకిటలాడిన ఆర్టీసీ బస్సులు

- కార్తీకమాసం మూడో సోమవారం 90 శాతం ఆక్యుపెన్సీ

ద్వారకా బస్‌స్టేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖ రీజియన్‌లో ఆర్టీసీ బస్సులన్నీ సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకూ రద్దీగా నడిచాయి. ముఖ్యంగా ఆలయాలు, సందర్శనీయ స్థలాలకు రాకపోకలు సాగించే బస్సులు కిక్కిరిశాయి. కార్తీకమాసం మూడో సోమవారం కావడంతో భక్తులు సింహాచలం, కనకమహాలక్ష్మి ఆలయాలతో పాటు శైవక్షేత్రాలు, అయ్యప్ప ఆలయాలకు భారీగా వెళ్లారు. సోమవారం ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 90 శాతంగా నమోదయ్యింది. నవంబరు ప్రారంభం నుంచి ఆదివారం వరకూ ఆక్యుపెన్సీ 84 శాతం ఉండగా, సోమవారం 90 శాతం నమోదయ్యింది. సింహాచలం, కైలాసగిరి, వన్‌టౌన్, మాధవధార ప్రాంతాలకు రాకపోకలు సాగించే బస్సుల్లో అత్యధికం శాతం ఓఆర్ ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

స్త్రీశక్తి ప్రభావం

కార్తీకమాసం మూడో సోమవారం 90 శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదు కావడానికి స్త్రీశక్తి పథకం కారణమని ఆర్టీసీ విశాఖ రీజియన్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించేందుకు అవకాశం ఉండడంతో ప్రసిద్ధ దేవాలయాలకు వెళ్లేందుకు ఆసక్తి చూపారన్నారు. రద్దీ రూట్లలో షెడ్యూల్ సర్వీసులకు మించి బస్సులు నడిపినట్టు తెలిపారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులను పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

పర్యవరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ శ్రీవాణి, విద్యార్థులు

తగరపువలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పర్యవరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తగరపువలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. శ్రీవాణి అన్నారు. కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని కళాశాల ఆవరణలో అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు.

లక్ష్మీపురంలో శివుని విగ్రహం ఆవిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరించిన జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు

భీమునిపట్నం (రూరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయ ఆవరణలో ఉన్న శివాలయంలో శిఖరంపై ఏర్పాటు చేసిన శివుని విగ్రహాన్ని జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు సోమవారం ఆవిష్కరించారు. తొలుత శివాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పుష్పార్చన, బిల్వ పత్రార్చన జరిపారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో సింగనబంద సర్పంచ్ నారాయణ, అయ్యప్ప సేవా పీఠం ధర్మకర్త గాడు తాతినాయుడు, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులు వెంకటరావు, సన్యాసినాయుడు, డి. సన్యాసి, జి. వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీల్లో చిట్టివలస బాలిక ప్రతిభ



బాలికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎ. జేష్టకు రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7, 8, 9 తేదీల్లో పార్వతీపురం మన్యం జిల్లా జోగుంపేట ఆశ్రమ పాఠశాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు జరిగాయి. ఇందులో జేష్టకు మొదటి బహుమతి లభించింది. ఈమేరకు సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం ఆదినారాయణ, ఫిజికల్ డైరెక్టర్లు అచ్యుతరావు, అప్పలరాజు, తదితరులు బాలికను అభినందించారు.

శివ ప్రకాశ్‌కు జాతీయ అవార్డు



శివ ప్రకాశ్‌కు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

సాగర్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పురాతన నాణేలు, స్టాంపుల సేకరణ కర్త, సహకార బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి జీఎస్ శివ ప్రకాశ్‌కు జాతీయ స్థాయి అవార్డు లభించింది. సోమవారం రుషికొండ సాయిప్రియా రిసార్ట్స్‌లో జరిగిన కార్యక్రమంలో పూరీజగన్నాథస్వామి ఆలయ దైతపతి భవిణ్‌దాస్ మహరాజ్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు పొందారు. 70 ఏళ్ల వయస్సు ఉన్న శివ ప్రసాద్ 50 ఏళ్లుగా పురాతన నాణేలు, తపాలా బిళ్లలు, వస్తువులను సేకరించి, ప్రదర్శనల ద్వారా యువతకు అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు విజయనగరంలోని సామాజిక సేవా సంస్థ ఆయన సేవలను గుర్తించి జాతీయ అవార్డు ప్రదానం చేసింది.

ఆనందపురం పాఠశాలలో బోరు ఏర్పాటు

ఆనందపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంపీపీ నిధులతో మంజూరు చేసిన బోరు పనులను స్థానిక నాయకులు సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మజ్జి వెంకట్రావు, చందక సూరిబాబు, కొట్యాడ సత్యమూర్తి, తదితరులు పాల్గొన్నారు. అలాగే అనంతరం గ్రామాన్ని ఆనుకుని ఉన్న బుడగ జంగాల కాలనీలో నూకాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్న బోరుకు సర్పంచ్ చందక లక్ష్మి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ రమణమ్మ, సినగం చినరామారావు, తదితరులు పాల్గొన్నారు.

భీమిలిలో షాపింగ్ కాంప్లెక్స్ దుకాణాలకు వేలం రేపు

భీమునిపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెయిన్ రోడ్‌లో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాలకు జోనల్ కార్యాలయంలో బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు జడ్సీ అయ్యప్పనాయుడు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీవీ ఎంసీ గెజిట్ నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం 11 దుకాణాలకు మూడేళ్ల కాలపరిమితికి గాను ఈ వేలం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు రూ. 48 వేలు కమిషనరు, జీవీఎంసీ పేరున డీడీ తీసి వేలంలో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు జోనల్ కార్యాలయంలో సంప్రతించాలని ఆయన సూచించారు.

విద్యార్థులకు తీరనున్న కష్టాలు

- చంద్రంపాలెం పాఠశాల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శంకుస్థాపన
- నెరవేరనున్న మధురవాడ ప్రాంతీయుల చిరకాల కోరిక
- త్వరలోనే పనులు ప్రారంభం



ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

కొమ్మాది, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆయన చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలగా చంద్రంపాలెం స్కూల్‌కు గుర్తింపు ఉందన్నారు. విద్యార్థులు నిత్యం జాతీయ రహదారి దాటుకుని పాఠశాలకు వస్తుండడం వల్ల తరచూ ప్రమాదాలకు గురవుతున్నారని, ఈమేరకు ఇక్కడ ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాస్తవానికి ప్రభుత్వం ఏర్పడగానే ఈ నిర్మాణం జరగాల్సి ఉండగా నేషనల్ హైవే, మెట్రో విభాగాల నుంచి అభ్యంతరాలు రావడంతో కొంత జాప్యం జరిగిందన్నారు. వారి అభ్యంతరాల వల్ల బ్రిడ్జి నిర్మాణానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యాడ్ ఏజెన్సీ యాజమాన్యం కూడా వెనక్కి వెళ్లిపోయిందని చెప్పారు. బ్రిడ్జి నిర్మాణం వల్ల మెట్రో ప్రాజెక్టు డిజైన్‌కు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని అధికారులు అభ్యంతరం చెప్పారని, ఈ విషయాన్ని మెట్రో ప్రాజెక్టు ఎండీ రామకృష్ణారెడ్డికి దృష్టికి తీసుకువెళ్లి ఇక్కడ బ్రిడ్జి అవసరాన్ని వివరించి, డిజైన్ మార్పునకు ఒప్పించానని తెలిపారు. త్వరలోనే పాఠశాల క్రీడా మైదానానికి కూడా శాశ్వత పరిష్కారం చూపించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఈనెల 14, 15 తేదీల్లో నగరంలో జరిగే పెట్టుబడుదారుల సదస్సులో రూ. 10 లక్షల కోట్ల పరిశ్రమలకు ఎంఓయూలు జరగనున్నాయన్నాయన్నారు. గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్, పిపి, సత్వా వంటి అంతర్జాతయ సంస్థలు నగరంలో ఏర్పాటు కానుండడంతో విశాఖ రాష్ట్రాభివృద్ధికి గ్రోత్ ఇంజన్ కానుందని అన్నారు.వచ్చే ఏడాది జూలై నాటికి భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుండడంతో రూ. 175 కోట్లతో ఏడు మాస్టర్ ప్లాన్ రహదారుల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అనంతరం ఆయన ఫుట్ ఓవర్ బ్రిడ్జి డిజైన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జోన్-2 కమిషనర్ కనక మహాలక్ష్మి, ఈఈ శాంతిరాజు, కార్పొరేటర్లు మొల్లి హేమలత, పిళ్లా మంగమ్మ, నాయకులు లొడగల అప్పారావు, చిక్కాల విజయ్‌బాబు, గాడు వెంకటప్పడు, గంటా నూకరాజు, మొల్లి లక్ష్మణరావు, పిళ్లా వెంకట్రావు, గరే గురునాథ్, నాగోతి సత్యనారాయణ, మామిడి దుర్గారావు, నాగోతి సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



ఎండాడలో పశుపతినాథేశ్వరుడు





భీమిలిలో తులసి మొక్కకు పూజలు చేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి

శివాలయాలకు కార్తీక శోభ

భీమునిపట్నం,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని శివాలయాలు కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని భక్తులతో రద్దీగా మారాయి. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. భీమునిపట్నంలో భ్రమరాంబికా సహిత చోడేశ్వరాలయం, కాత్యాయిని సహిత భీమేశ్వరాలయంలో దర్శనాలకు క్యూ కట్టారు. శివ, కేశవ ఆలయాల ఆవరణలో ఉసిరి, తులసి, రావిచెట్టు చుట్టూ ప్రదక్షిణలు చేసి, దీపాలు వెలిగించి పూజలు చేశారు. సాయంత్రం ధ్వజస్తంభాల వద్ద, నందీశ్వరుని వద్ద దీపాలు వెలిగించారు. అలాగే లక్ష్మీనరసింహస్వామి ఆలయం, రుక్మిణీ సత్యభామ సహిత వేణుగోపాలస్వామి ఆలయం, జగన్నాథస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. కన్యకాపరమేశ్వరి ఆలయంలో దీపారాధన చేయగా, కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యన్నారాయణ వ్రతం నిర్వహించారు. కాగా కన్యకాపరమేశ్వరి ఆలయంలో సాయంత్రం సహస్ర దీపాలంకరణ జరిగింది. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, పట్టణంలోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలు వెలిగించారు.

ఎండాడలో...

ఎండాడ : ఎండాడ కోదండ రామాలయం, షిర్డీసాయి గణపతి పశుపతినాథేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక మాసం మూడో సోమవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కైలాసగిరి దిగువున ఉన్న భవానీ సమేత కైలాసగిరీశ్వరస్వామి ఆలయంలో సామూహిక ఏకవార అభిషేకాలు నిర్వహించారు. విశాలాక్షీనగర్‌లో ఉన్న విశాలాక్షీసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో వేకువజాము నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణం భక్తుల శివనామ స్మరణతో మార్మోగింది.



సింహగిరిపై అభిషేకాలు చేస్తున్న భక్తులు

సింహాచలంలో...

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పరిధిలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సింహగిరి క్షేత్రపాలకుడు బాలత్రిపుర సుందరి సహిత త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామికి అర్చకులు సుప్రభాతసేవ తరువాత ఏకవార రుద్రాభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా పండితులు నమకం, చమకం పారాయణలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. పాత అడివివరం, విజినిగిరిపాలెం, సింహాచలం గ్రామాల పరిధిలోని శైవ క్షేత్రాల్లో కూడా భక్తుల రద్దీ నెలకొంది.



గుడిలోవలో భక్తుల క్యూ

గుడిలోవకు పోటెత్తిన భక్తులు

ఆనందపురం : గుడిలోవ కొండ మీద ఉన్న శివాలయానికి భక్తులు పోటెత్తారు. పలు గ్రామాలకు చెందిన వారు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కొండపై వన సమారాధనలు కూడా జరగడంతో ఆ ప్రాంతం సందడిగా కనిపించింది

పద్మనాభంలో...

పద్మనాభం రూరల్ : మండలంలోని అనంతవరం శ్రీమన్నారాణేశ్వర ఆలయం. విలాస్‌ఖాన్‌పాలెంలో రామలింగేశ్వరస్వామి ఆలయం, కురపల్లి, తునివలస, పొట్నూరు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు వేకువజామున ఆలయాలకు చేరుకుని శివునికి పూజలు అభిషేకాలు నిర్వహించారు.

జాబ్‌మేళాలో 107 మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన వారితో జాబ్‌మేళా నిర్వాహకులు

భీమునిపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 107 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఆ కళాశాల జేకేసీ, ప్లేస్‌మెంట్ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ సురేఖ అధ్యక్షత వహించారు. 15 కంపెనీల ప్రతినిధులు హాజరై 250 మంది అభ్యర్థుల్లో 107 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరిలో 24 మంది ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారని ప్రిన్సిపాల్ తెలిపారు. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, వైస్ ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి, జేకేసీ కోఆర్డినేటర్ మాధురి, ప్లేస్‌మెంట్ ఆఫీసరు వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి అభినందనలు



శైలేష్‌కుమార్‌ను అభినందిస్తున్న త్రినాథరెడ్డి

భీమునిపట్నం (రూరల్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లవలస గ్రామానికి చెందిన క్రీడాకారుడు శైలేష్‌కుమార్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడంతో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రో కబడ్డీ తెలుగు టైటాన్స్ సీఈఓ త్రినాథరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై, క్రీడాకారుడ్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పలకలు

- ఎక్కడికక్కడ అతుకుల వద్ద ఖాళీలు
- రాకపోకలకు పాదచారుల ఇబ్బందులు
- తగరపువలస వంతెనలపై ఫుట్‌పాత్‌ల దుస్థితి



మరమ్మతులు చేపట్టాల్సిన పలకలు

తగరపువలస, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస వద్ద గోస్తనీ నదిపై ఉన్న రెండు వంతెనలపై ఇరువైపులా పాదచారులు నడవడానికి ఉన్న ఫుట్‌పాత్‌లు శిథిలమయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో పక్కపక్కన రెండు వంతెనలు ఉన్నాయి. రెండు వైపులా రాకపోకలు సాగించే వాహనాల కోసం వేర్వేరుగా వంతెనలు నిర్వహిస్తున్నారు. ఈ రెండు ఫుట్‌పాత్‌లకు వంతెనలు ఉన్నాయి. అయితే పలుచోట్ల ఇవి పాడైపోయాయి.ఈ సమీపంలో తుప్పలు, డొంకలు పెరిగిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో పలకలు పాడైపోవడంతో నడవడానికి ఇబ్బందిగా ఉంటోందని పాదచారులు వాపోతున్నారు. ఇక్కడికి ఈ సమీపంలో ఉన్న అవంతి కళాశాలలో చదువుతున్న విద్యార్థులు వంతెనపై నుంచి నడుచుకొని తగరపువలస బైపాస్‌రోడ్డు వరకు వస్తుంటారు. మరో వంతెన వద్ద ఫుట్‌పాత్‌పై నగరపాలెం తదితర ప్రాంతాలకు నడుచుకొని వెళ్లేవారు వినియోగిస్తుంటారు. వీటితో పాటు వంతెనపై ఉన్న రహదారికి కొన్నిచోట్ల అతుకులు ఖాళీగా ఉండడం వల్ల కూడా ఇబ్బందిగా ఉందని అంటున్నారు. ఈ వంతెనలకు మరమ్మతుల చేపట్టే విషయంలో జాతీయ రహదారుల విస్తరణ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి

తపాలా క్రీడాకారుల టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి

విశాఖపట్నం, స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తపాల శాఖ ఆధ్వర్యంలో 40వ అఖిల భారత టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో ప్రారంభమయింది. ఏపీతో పాటు ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, అసోం, ఝార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాల నుంచి 129 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముందుగా క్రీడా వందనాన్ని ముఖ్య అతిథి ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి స్వీకరించారు. అనంతరం అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, విశాఖ పోస్టు మాస్టర్ జనరల్ వీఎస్. జయశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ క్రీడలు శారీరక పటుత్వాన్ని పెంపొందించడమే కాకుండా స్నేహభావం నెలకొల్పుతాయన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం జ్ఞాపకంగా నిలుస్తుందన్నారు. క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తితో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. అర్జున అవార్డీ నీలంశెట్టి లక్ష్మి మాట్లాడుతూ దేశానికి గొప్ప ఖ్యాతినందించే అవకాశం క్రీడల్లో లభిస్తుందన్నారు. అనంతరం ప్రత్యేక పోస్టల్ కవర్‌ను చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంతోష్‌కుమార్ నేథా, విశాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ ఎన్‌వీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

పలువురు సీఐలకు పోస్టింగ్స్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విశాఖపట్నం రేంజ్‌లో పలువురు సీఐలకు బదిలీలు/పోస్టింగ్స్ ఇస్తూ డీఐజీ గోపినాథ్ జట్టీ ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం జిల్లా డీసీఆర్‌బీలో ఉన్న బొడ్డేపల్లి సుధాకర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి సర్కిల్‌కు బదిలీ చేసి, అతని స్థానంలో విశాఖ రేంజ్‌లోని కె. కుమార్‌స్వామిని నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న బి. నారీమణికి శ్రీకాకుళం మహిళా పోలీస్ సర్కిల్‌లో పోస్టింగ్ ఇచ్చి, అక్కడ పనిచేస్తున్న వానపల్లి రామారావును శ్రీకాకుళం ట్రాఫిక్ సర్కిల్‌కు బదిలీ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్. లక్ష్మణరావుకు అల్లూరి సీతారామరాజు జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐగా పోస్టింగ్ ఇచ్చి, అక్కడి సీఐ సువ్వారి రామును రేంజ్ వీఆర్‌కు, అచ్యుతాపురం యూపీఎస్ సీఐ నమ్మి గణేశ్‌ను రేంజ్‌కు అటాచ్ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న కంది నీలిమను అనకాపల్లి జిల్లా మహిళా పోలీస్ సర్కిల్‌లో నియమించి, అక్కడ పని చేస్తున్న ఆర్వీఎస్ఎస్ చంద్రశేఖరరావును అచ్యుతాపురం యూపీఎస్‌కు బదిలీ చేశారు.

ఆశ వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర కమిటీని సోమవారం ప్రకటించారు. కమిటీ అధ్యక్షురాలిగా జి.రమణకుమారి (నంద్యాల), ప్రధాన కార్యదర్శిగా కె.ధనలక్ష్మి (అమరావతి), కోశాధికారిగా ఎ.కమల (ఎన్టీఆర్ జిల్లా), ఉపాధ్యక్షులుగా బి. సుధారాణి (విజయనగరం), వి.సత్యవతి (అనకాపల్లి), డి.అన్నపూర్ణ (నెల్లూరు), పి. ధనశ్రీ (కృష్ణా), జి.అమరావతి (శ్రీకాకుళం), ఎం.శివానీ (మన్యం), కె.కల్పన (ప్రకాశం), ఎస్.పద్మ (విశాఖ), ఎం.నాగమణి (అనంతపురం) ఎన్నికయ్యారు. 23 మంది ఆఫీస్ బేరర్స్‌తో పాటు 53 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సీఐటీయూ ప్రతినిధి వీవీ శ్రీనివాసరావు తెలిపారు.

క్లాప్ కాంట్రాక్టర్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

మూర్తియాదవ్ పూర్తి ఆధారాలను అందజేశారు. వీటన్నింటినీ పరిశీలించిన కమిషనర్ లోడర్లకు వేతనాలు ఇచ్చే బాధ్యత నుంచి క్లాప్ కాంట్రాక్టర్‌ను పక్కనపెట్టారు. ఆ బాధ్యతను ఒక్కో జోన్‌లో ఒక్కో ఎస్ఎల్ఎఫ్‌కు అప్పగించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా ఇకపై జీవీఎంసీలో ఎలాంటి టెండర్‌లో కూడా క్లాప్ కాంట్రాక్టు సంస్థ (శ్రీదుర్గా కన్సల్టెన్సీ సర్వీసెస్) పాల్గొనడానికి అర్హత లేకుండా బ్లాక్ లిస్ట్‌లో చేర్చారు. మరోవైపు క్లాప్ వాహనాల పనితీరుపై కూడా తీవ్రస్థాయిలో విమర్శలు ఉన్నాయి. వాహనాలు తమకు కేటాయించిన ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లడం లేదని, ఒక ట్రిప్పు తిరిగితే మూడు ట్రిప్పులు వేసినట్టు చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపైకి తెచ్చిపడేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కూడా కమిషనర్ దృష్టిపెట్టారని, త్వరలో క్లాప్ వాహనాల విషయంలో కూడా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఐటీ సిటీ

... 5వ పేజీ తరువాయి

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థకు 160 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.489 కోట్లతో నీటి అడుగున ఆయుధాలు, రక్షణ పరికరాలు తయారుచేసే వ్యవస్థను రూపొందిస్తుంది. అందులో 500 మందికి ఉద్యోగాలు వస్తాయి.

- అనకాపల్లి జిల్లాలో డోజోకో ఇండియా సంస్థకు 150 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.1,234 కోట్ల పెట్టుబడితో 1,454 మందికి ఉపాధి కల్పిస్తుంది.
- విశాఖపట్నానికి చెందిన విశ్వనాథ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ సంస్థకు భవానీద్వీపంలో అడ్వెంచర్ థ్రిల్ సిటీ ఏర్పాటుకు భూమి కేటాయించారు. ఈ సంస్థ విశాఖ నుంచి విజయవాడకు తన కార్యకలాపాలు విస్తరించనుంది.
- విశాఖపట్నంలో జీఎస్టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. అందులో నిజాయితీగా పనిచేసే అధికారులు, సిబ్బందిని నియమించాలని సూచించారు.
- విశాఖపట్నంలో రియల్‌టైమ్ గవర్నెన్స్, డిజిటల్ పరిపాలన తదితరాల కోసం సింగపూర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నగర నేతలు

... 5వ పేజీ తరువాయి

కళింగ వైశ్య సంక్షేమం, అభివృద్ధి బోర్డు డైరెక్టర్లుగా పొట్నూరు అప్పారావు (బీజేపీ), తూర్పు నియోజకవర్గానికి చెందిన తంగుడు సంతోష్‌కుమార్ (టీడీపీ), పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కోరాడ శ్రీనివాసరావు (టీడీపీ), ఎంఎస్ఎంఈ సంక్షేమం, అభివృద్ధి బోర్డు డైరెక్టర్లుగా నగరానికి చెందిన నీలాపు విజయానందరెడ్డి (బీజేపీ), తూర్పు నియోజకవర్గానికి చెందిన ముగడ రాజారావు (టీడీపీ) నియమితులయ్యారు.

పెట్టుబడుల సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఉండాలన్నారు. అతిథులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని విషయాల్లో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్షలో రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ చందోలు, సత్తిబాబు, లతామాధురి, వెంకటరత్నం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సీతంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి మధురానగర్‌లో నివాసం ఉంటున్న ఒక యువకుడు మనస్తాపంతో ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కొర్లాం గ్రామానికి చెందిన ఎస్. సంపత్‌కుమార్ (32) ఎంబీఏ చదువుకొని, ఉద్యోగం కోసం కొంత కాలం క్రితం విశాఖపట్నం వచ్చి సీతంపేట మధురానగర్‌లోని ఓ ఇంటిలో బ్యాచిలర్స్‌తో కలిసి ఉంటున్నాడు. ఆశించిన ఉద్యోగం దొరక్కపోవడంతో చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు. ఆ సమయంలో కొత్త ద్విచక్ర వాహనాన్ని వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశాడు. ఫైనాన్స్ డబ్బులు కట్టలేకపోయాడు. మూడు నెలలుగా ఇంటి అద్దె కూడా చెల్లించలేదు. ఈ క్రమంలో సోమవారం రూమ్మేట్స్ బయటకు వెళ్లిన సమయంలో వంట గదిలో ఫ్యానుకు టవల్‌తో ఉరేసుకున్నాడు.అనుకున్నది సాధించలేకపోయానని, మంచి ఉద్యోగం రాలేదని, నా చావుకు ఎవరూ బాధ్యులు కారని, సారీ.. అమ్మా అంటూ సూసైడ్ నోట్ రాశాడు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న ద్వారకా స్టేషన్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ ధర్మేంద్ర సిబ్బందితో వెళ్లి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. మృతుడి సోదరుడు శ్రీను ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు ప్రతిభా అవార్డులు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవం పురస్కరించుకుని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంగళ వారం అవార్డులను ప్రదానం చేస్తున్నామని మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ ఖాజా రహమతుల్లా పేర్కొన్నారు. ఎంవీపీలోని ఒక కళాశాల ఆవరణలో సోమవారం మీడియా తో మాట్లాడారు. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పది, ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 150 మంది విద్యార్థులకు అవార్డు లను అందిస్తామన్నారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం కాలేజీలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ట్రస్ట్ వైస్ చైర్మన్ కేఎం సిస్టీ మాట్లాడుతూ కార్య క్రమానికి ముఖ్య అతిథులుగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్, ఎంపీ శ్రీభరత్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏటా విద్యా దినోత్సవం నిర్వహిస్తున్నామని, ఈసారి విశాఖలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సమావేశంలో బాజీ, మహ్మద్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన ఐఐజీ డైరెక్టర్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి : ఏయూను ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ జియో మేగ్నటిజం (ఐఐజీ) సంస్థ సంచాలకుడు ప్రొఫెసర్ ఏపీ డిమ్రి సోమవారం సందర్శించారు. వీసీ రాజశేఖర్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీ శతాబ్ది ఉత్సవాలు, జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వీసీ వివరించారు. గతంలో ఏయూ- ఐఐజీ మధ్య జరిగిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ)ను పునరుద్ధరించడం, కార్యరూపంలో చూపడంపై చర్చించారు.

సినిమా గైడ్

- **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి. సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి).
- **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **జటాధర** : శారదా, శ్రీకన్య
- **బ్యాడ్ ల్యాండ్స్/ఫినిక్స్** : రమాదేవి
- **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- **క్రాంప్** : వెంకటేశ్వర-1.

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 54, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 60, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 58, దొండకాయలు 50, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో)68, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోస కాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 38,బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 46, దేముడు చిక్కుడు 68, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230



కొత్తవెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో శివ లింగం



కేఆర్ఎం కాలనీ శివాలయంలో పూజలు



కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ప్రధాన అర్చకుడు కాశీప్రసాద్

వైభవంగా కార్తీక మాస పూజలు

వెంకోజీపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శివ దర్శనానికి భక్తులు బారులు తీరారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు చేరుకుని అభిషేకాలు జరిపారు. కొత్తవెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో ప్రధానార్చకుడు ఆరవెల్లి సూర్యప్రకాశ్ శర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు, అర్చనలు నిర్వహించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 వరకు మహా రుద్రాభిషేకం జరిపారు. సాయంత్రం మహిళలు ధ్వజస్తంభం వద్ద ఆకాశ జ్యోతి వెలిగించారు. దేవస్థానం ఈవో బండారు ప్రసాద్, సిబ్బంది భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. స్థానిక గ్రామ సేవా సంఘం సభ్యులు, కొందరు భక్తులు సహకరించారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలోనూ,హెచ్‌బీకాలనీ, ఇసుకతోట, కేఆర్ఎం కాలనీలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెదవాల్తేరు : పెదవాల్తేరులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో చైర్‌పర్సన్ సీహెచ్ జ్యోతి ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పూజలు, పంచామృత అభిషేకాలు నిర్వహించారు.కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు కిక్కిరిశాయి. సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. ఆలయ ప్రధాన అర్చకులు కాశీ ప్రసాద్, చిన అప్పారావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఆరిలోవలోని శివాలయాలు భక్తులతో రద్దీగా మారాయి.పెదగదిలిలోని కాశీ అన్నపూర్ణ సహిత విశ్వేశ్వర ఆలయంలో శివునికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. అలాగే బాలత్రిపుర సుందరీ సహితస్వామి ఆలయంలోనూ ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయం ట్రస్టీ కృష్ణంరాజు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు.



ఇండోర్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

పనులు మందకొడిగా చేపడితే ఎలా?

త్వరలో సమీక్షిస్తా.. మేయర్ అసహనం

వెంకోజీపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం, పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ స్వర్ణ భారతి స్టేడియం పునర్నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. క్రీడలకు విశాఖ ఎంతో అనుకూలమని, జాతీయ, అంతర్జాతీయ క్రీడలు జరగడమే కాకుండా విశాఖ నుంచి ఎంతోమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఆటలాడి నగరానికి గుర్తింపు తెచ్చారన్నారు. దాదాపు రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్న స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పనులు మందకొడిగా సాగుతున్నాయని, ఇంకా గదులు పూర్తి కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. గత ప్రభుత్వం ఆట స్థలాలు పేదలకు అందుబాటులో లేకుండా ప్రైవేటు వారికి దారాదత్తం చేసిందని ఆరోపించారు. త్వరలో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియం పనులపై అధికారులతో సమీక్షిస్తామని మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవీ ఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ.ఎ.రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ గంగాధరరావు, జీవీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీమ్ వర్క్‌తోనే విజయాలు సాధ్యం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అధికారులు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడల ద్వారా శరీరం ఉత్సాహంగా మారడంతో పాటు టీమ్ వర్క్ అలవడుతుందని, తద్వారా విజయాలను సాధించేందుకు అవకాశం ఉంటుందని రీడ్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ డీన్ అండ్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌పీ రవీంద్ర తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ఐఐఏఎం బిజినెస్ స్కూల్‌లో సోమవారం ఎవాక్-2025 పేరుతో స్పోర్ట్స్ మీట్‌ను బెలూన్లు ఎగురవేసి ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. క్రీడలతో క్రమశిక్షణ అలవడుతుందని, ప్రతి విద్యార్థీ ఏదో ఒక క్రీడలో రాణించాలన్నారు. కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఏయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ మాట్లాడుతూ క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. గతంలో పాఠ్యేతర కార్యక్రమాలుగా నిర్వహించే వారని,ప్రస్తుతం సహ పాఠ్యాలుగా నిర్వహిస్తున్నారన్నారు. రీడ్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ వి. కృష్ణమోహన్ మాట్లాడుతూ క్రీడాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థులు మెరుగైన స్థానాలను అధిరోహించేందుకు అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 500 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే వెలగపూడి

రూ. 40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

రామ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బానోజీనగర్‌లో రూ. 40 లక్షల జీవీఎంసీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులను మేయర్ పీలా శ్రీనివాసరావు, తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు సోమవారం ప్రారంభించారు. 28వ వార్డు టీడీపీ అధ్యక్షుడు నక్కా కనకరాజు, కార్పొరేటర్ పల్లా అప్పలకొండ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జు పల్లా దుర్గారావు, జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు, ఉసిరికాయల డిల్లీశ్వరి, నాగుల సన్యాసిరావు, ఉరుకూటి పైడిరాజు, నడిగట్ల శంకరరావు, శ్యామలా ఆశ్లేషా, మంగమ్మ, సంపంగి సురేశ్, పోలిపల్లి సురేశ్, అత్తిలి కొండలరావు, అప్పారావు పాల్గొన్నారు.

క్రీడాకారునికి ఎమ్మెల్యే అభినందనలు



పృథ్వీరాజ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణబాబు

ఎంవీపీ కాలనీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) :హెచ్‌బీ కాలనీకి చెందిన కొప్పిశెట్టి పృథ్వీరాజ్ మూడో ప్రొఫెషనల్ బాక్సింగ్ లీగ్‌లో ప్రథమ బహుమతి సాధించడంతో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అభినందించారు. లంకపల్లి బుల్లయ్య కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న పృథ్వీరాజ్ సోమవారం ఎంవీపీ కాలనీలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. వెలగపూడి క్రీడాకారుడ్ని అభినందించి, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించడం ద్వారా నగరానికి పేరు తీసుకురావాలని సూచించారు. ఆయనతో పాటు కోచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

'అందెశ్రీ పాటకు మరణం లేదు'

సిరిపురం, నవబంరు 10 (ఆంధ్రజ్యోతి): అందెశ్రీ పాటకు మరణం లేదని ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ అన్నారు. అందెశ్రీ మరణం కళా ప్రపంచానికి తీరని లోటని, ప్రతీ తెలుగు గుండెను తడిపేసిందన్నారు. అందెశ్రీ మరణం పట్ల కన్నీటి నివాళి అర్పిస్తున్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గొప్ప సాహిత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన అందెశ్రీ ప్రజా కవులందరికీ ఆదర్శప్రాయుడన్నారు. ఆయన చూపిన మార్గంలో అంతా నడవాలన్నారు.

తెలుగు భాష పరిరక్షణ కోసం సత్యాగ్రహదీక్ష

సిరిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగుభాష పరిరక్షణ కోసం తెలుగుదండు టిట్టిభ సత్యాగ్రహం చేపట్టింది. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీ బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించి అంజలి ఘటించారు. తెలుగు భాష పరిరక్షణ కోసం కూటమి ప్రభుత్వంతో అమీ తుమీ తేల్చుకునేందుకే దీక్ష చేస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించే దీక్షలో భాషాభిమానులు పాల్గొనాలని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు సూరి కోరారు.

బకాయిలు చెల్లించాలని సినర్జీస్ కార్మికుల ధర్నా



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న కుమార్


సిరిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బకాయిలు చెల్లించి తమను ఆదుకోవాలని కోరుతూ దువ్వాడ సినర్జీస్ కంపెనీ కార్మికులు కుటుంబాలతో కలిసి సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. వేతనాలతో పాటు బోనస్ ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని నినదించారు. ధర్నాకు సంఘీభావం తెలిపిన సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్‌వీ కుమార్ మాట్లాడుతూ ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికుల విషయంలో సినర్జీస్ యాజమాన్యం నిర్లక్ష్యధోరణితో వ్యవహరించటం సరైంది కాదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ పేరిట కార్మికుల వేతనాల నుంచి మినహాయిస్తున్నప్పటికీ, యాజమాన్య వాటా చెల్లించకపోవంతో తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. తొమ్మిదేళ్లుగా బోనస్ కూడా చెల్లించకపోయినా, ఎప్పటికైనా వస్తుందనే ఆశతో కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములవుతున్న కార్మికుల పొట్ట కొట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్మిక కార్యాలయంలో జరిగిన ఒప్పందాన్ని సైతం కాలరాసేలా వ్యవహరించటం యాజమాన్య నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు.ఆరు నెలలుగా వేతనాలు లేకపోవటంతో కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని, యాజమాన్యం తక్షణ చర్యలు తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సినర్జీస్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యదర్శి దాస్, ఐద్వా నాయకురాలు లక్ష్మి, కామేశ్వరి, లోకేశ్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

చిల్లర వర్తకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బీచ్ చిల్లర వర్తకుల సంఘం

రామ్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తృప్తి క్యాంటీన్‌లో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆహార పదార్థాలు విక్రయించకపోతే తొలగించాలని నగర బీచ్ చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. సోమవారం తృప్తి క్యాంటీన్ వద్ద వ్యాపార సంఘం సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామకృష్ణ బీచ్ సముద్ర తీరంలో తృప్తి క్యాంటీన్ పేరుతో డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు ఆహారం, అల్పాహారాన్ని ఒక కంటెయినర్‌లో తయారు చేస్తూ తక్కువ ధరలకు అమ్ముకునేందుకు అనుమతులు ఇచ్చారని, కానీ నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలను వారికి నచ్చిన ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. ఇక్కడ పదార్థాలు అమ్మగా వచ్చిన డబ్బును తృప్తి సంస్థకు కాకుండా, వారి సొంత ఖాతాల్లోకి మళ్లిస్తున్నారని ఆరోపించారు. జీవీఎంసీ జోన్-4 యూసీడీ విభాగం ఏపీడీ పద్మావతి ఆందోళనకారుల వద్దకు వచ్చి మాట్లాడారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు. సుమారు 200 మంది బీచ్ వర్తకులు ఆందోళనలో పాల్గొన్నారు.





మద్దిలపాలెం, త్రీ టౌన్ జంక్షన్ల వద్ద కార్లను తనిఖీ చేస్తున్న పోలీసులు

ఢిల్లీలో జరిగిన పేలుళ్ల నేపథ్యంలో నగరంలోని పోలీసులు అప్రమత్తమయ్యారు. సోమవారం రాత్రి జాతీయ రహదారిపై ఎంవీపీ కాలనీ, మద్దిలపాలెం, గురుద్వారా, తదితర జంక్షన్‌ల వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీ చేశారు. ఏసీపీల పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరిగాయి.

- మద్దిలపాలెం, ఆంధ్రజ్యోతి

సూక్ష్మ చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా రాజారావు

ఆరిలోవ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గ పరిధిలోని ఆరిలోవ 11వ వార్డు టీడీపీ అధ్యక్షుడు ముగడ రాజారావును రాష్ట్ర ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా నియమించింది. ఈమేరకు సోమవారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయని రాజారావు తెలిపారు.

ఘనంగా అంబలం పూజ

వెంకోజీపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పాతవెంకోజీపాలెం కనకమాంబ ఆలయం వద్ద రాధాకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అంబలం పూజ జరిగింది. అయ్యప్పకు పంచామృత అభిషేకాలు, పాటలతో ఈప్రాంతం ఆద్యంతం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది. తొలుత అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని వీధుల్లో సాము గరిడీ, సన్నాయి మేళాలతో ఊరేగించారు. మాలధారులంతా పేటా తూళి ఆడారు. కార్యక్రమంలో గురుస్వామి పల్లా చిన్నారావు, ఒమ్మి ముత్యాలరాజు, పల్లా శ్రీను, పల్లా శివ, ఒమ్మి కోటి, హరీశ్, ప్రసాద్, 500 మంది అయ్యప్ప భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం

- టీసీఆర్, టీఎం డైరెక్టర్ రాణిమందా
- రాష్ట్రస్థాయి గిరిజన క్రీడా పోటీలు ప్రారంభం

ఎండాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గిరిజన యువతలో క్రీడాస్ఫూర్తి, ఐక్యత, క్రమశిక్షణ నాయకత్వ గుణాలను పెంపొందించడంలో క్రీడలు దోహదపడతాయని ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ మిషన్ (టీసీఆర్, టీఎం) డైరెక్టర్ డాక్టర్ రాణిమందా అన్నారు. గీతం వైద్య విద్యాలయం వేదికగా జనజాతీయ గౌరవ్ దివస్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ టీసీఆర్ అండ్ టీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి గిరిజన క్రీడా పోటీలను ఆమె సోమవారం ప్రారంభించారు. సీతంపేట, పార్వతీపురం, పాడేరు, ఆర్‌సీవరం, కేఆర్ పురం, చింతూరు, శ్రీశైలం, నెల్లూరు ఐటీడీఏల నుంచి గిరిజన విద్యార్థులు పోటీలలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంప్రదాయ గిరిజన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో టీసీఆర్‌టీఎం అధికారులు, సిబ్బంది, పీడీలు పాల్గొన్నారు.



గిరిజన క్రీడలను ప్రారంభిస్తున్న టీసీఆర్ టీఎం డైరెక్టర్ రాణిమందా



సీతంపేట పార్వతీశ్వరాలయంలో మహాశివలింగానికి పాలాభిషేకం



ఆలయంలో పూజలు, అభిషేకాలు చేయించుకుంటున్న భక్తులు



ధ్వజస్తంభం వద్ద సోమవారం రాత్రి కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



రామకృష్ణానగర్‌లో రామలింగేశ్వరుడ్ని దర్శించుకుంటున్న ఎంపీ శ్రీభరత్ కార్పొరేటర్ ముక్కా శ్రావణి తదితరులు

శంభో శంకర...పాహిమాం



మాధవధార కొండమీది ఆలయంలో భక్తులు

మాధవధార, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ఉత్తర నియోజకవర్గంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. సింహాచల దేవస్థానం ఉప దేవాలయమైన శ్రీమల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తులు ఉదయం నాలుగు గంటల నుంచే ముక్కంటి దర్శనానికి క్యూ కట్టారు. శివయ్యకు ఆలయ అర్చకుడు శ్రీనివాస శర్మ అర్చనలు, పంచామృతాభిషేకాలు జరిపారు. మాధవధార హైస్కూలు దగ్గర గౌరీ రామలింగేశ్వరాలయం, బర్మాక్యాంప్ శివాలయం, సత్యానగర్‌లోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో భక్తజన సందోహం నెలకొంది. ప్రత్యేక వసతులతో ఆలయాలు, పరిసరాలు పండుగ వాతావరణంతో ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. దేవస్థానం ఈఓ, సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు దర్శన ఏర్పాట్లు చేశారు.

పార్వతీశ్వరాలయం, నీలకంఠేశ్వరాలయాల్లో..

సీతంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీతంపేట పార్వతీశ్వరాలయానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి గోత్రనామాలతో పూజలు, అభిషేకాలు చేయించుకున్నారు. ధ్వజస్తంభం వద్ద సాయంత్రం దీపాలు వెలిగించారు. ఆలయ అర్చకులు భాస్కర్ శర్మ, శివాజీ శర్మ, అర్చక బృందం శివునికి అభిషేకాలు చేసి అలంకరించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సీతమ్మధార నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ, ఆలయ ఈఓ బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఆలయంలో మహా శివలింగానికి పంచామృతాలు, ఫలరసాలతో అభిషేకించారు. అర్చకులు రామారావు శర్మ, మహేష్ శర్మలు పూజలు చేయించారు.

భోళాశంకరుడిని దర్శించుకున్న ఎంపీ శ్రీభరత్

అక్కయ్యపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 26వ వార్డు రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో భోళా శంకరుడిని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ప్రతినిధులు మేళాతాళాలతో ఆహ్వానించారు. ఆయనతో పాటు టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు గండి బాబ్జి, ఎంపీ కార్యాలయం ఇన్‌చార్జ్ శ్రీధర్, కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి వినతి



సీఎండీ పృథ్వీతేజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధిలో దీర్ఘకాలంగా మరమ్మతులకు లోనైన విద్యుత్ దీపాల సమస్యను పరిష్కరించాలని కార్పొరేటర్ గంకల కవిత ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వార్డు పరిధిలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి వాటి స్థానే నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అధిక భాగం కొండవాలు ప్రాంతం కావడంతో చీకటి అలుముకుని ఉంటుందన్నారు. అవసరమైన చోట నూతన దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మెయిన్ సర్వీస్ వైర్లు చాలా కిందికి ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, మార్చాలని కోరారు. సీఎండీని కలిసినవారిలో బీజేపీ నాయకుడు గంకల అప్పారావు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

అల్లిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సౌత్ జైలు రోడ్డులో కొనసాగుతున్న కొత్త రోడ్డు నిర్మాణ పనులను దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకుడు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు సోమవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.1.45 కోట్లతో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ నుంచి ఎల్‌ఐసీ బిల్డింగ్ వరకు బీటీ రోడ్డు నిర్మాణం కొనసాగుతోందన్నారు. వార్డు అభివృద్ధిలో రాజీ పడడం లేదని పేర్కొన్నారు. వార్డులో అభివృద్ధి పనుల పురోగతిని వివరించారు. ఏఈ ప్రత్యూష, వర్క్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు, కాంట్రాక్టర్ అప్పలనాయుడు, కె.కృష్ణ, కుమారి తదితరులు పాల్గొన్నారు.

అందెశ్రీ మృతి తీరని లోటు

డాబాగార్డెన్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రముఖ కవి అందెశ్రీ మృతి సాహిత్య రంగానికి పెద్ద లోటని విశ్వసాహితీ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తివాడ శ్రీకాంత్ సంతాపం వ్యక్తం చేశారు. అందెశ్రీని మరో కాళిదాసుగా అభివర్ణించారు. విద్య లేకున్నా పండితులు సైతం నివ్వెరపోయేలా రచనలు చేయడం ఆయనకే సాధ్యమైందన్నారు. ముఖ్యంగా 'మాయమైపోతున్నడమ్మా... మనిషన్న వాడు' అనే గీతం ఆయనకు మంచి పేరు తీసుకురావడంతో పాటు తెలుగువారందరినీ ఆలోపింపజేసిందని గుర్తుచేశారు. అందెశ్రీ మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సీతంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ద్వారకా పోలీసు స్టేషన్ పరిధి మధురానగర్‌లో నివాసం ఉంటున్న ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా కొర్లాం గ్రామానికి చెందిన ఎస్.సంపత్‌కుమార్ (32) ఎంబీఏ చదువుకొని, ఉద్యోగం కోసం కొంత కాలం క్రితం విశాఖపట్నం వచ్చి సీతంపేట మధురానగర్‌లోని ఓ ఇంటిలో బ్యాచిలర్స్‌తో కలిసి ఉంటున్నాడు. ఆశించిన ఉద్యోగం దొరక్కపోవడంతో చిన్న చిన్న ఉద్యోగాలు చేశాడు. ఆ సమయంలో కొత్త ద్విచక్ర వాహనాన్ని వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేశాడు. కానీ ఫైనాన్స్ డబ్బులు కట్టలేకపోయాడు. మూడు నెలలుగా ఇంటి అద్దె కూడా చెల్లించలేదు. ఈ క్రమంలో సోమవారం రూమ్మేట్స్ బయటకు వెళ్లిన సమయంలో వంట గదిలో ఫ్యానుకు టవల్‌తో ఉరేసుకున్నాడు. అనుకున్నది సాధించలేకపోయానని, మంచి ఉద్యోగం రాలేదని, నా చావుకు ఎవరూ బాధ్యులు కారని, సారీ.. అమ్మా అంటూ సూసైడ్ నోట్ రాశాడు. ద్వారకా స్టేషన్ సీఐ వెంకటరమణ, ఎస్ఐ ధర్మేంద్రలు సిబ్బందితో వెళ్లి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. మృతుడి సోదరుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మార్గశిర మాసోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



కనకమహాలక్ష్మి ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అధికారులు

మహారాణిపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర మాసోత్సవాల్లో భక్తులకు అన్ని వసతులను దేవస్థానం పక్కాగా చేపడుతుందని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. సోమవారం ఈవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ముఖ్య పర్వదినాలు, గురువారం రోజులలో టౌన్ కొత్తరోడ్డు వరకు క్యూలైన్లు ఏర్పాటు చేస్తామన్నారు. అమ్మవారికి తొలిపూజ బుధవారం రాత్రి 12.01 గంటల నుంచి ప్రారంభమవుతుందన్నారు. 2.30 గంటల నుంచి భక్తుల దర్శనాలకు అనుమతిస్తామన్నారు. టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథ స్వామి ఆలయంలో నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తామన్నారు. డిసెంబరు 13న సాయంత్రం 4 గంటలకు అమ్మవారి రథయాత్రను అంబికాబాగ్ ఆలయం నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబరు 18న ఆఖరి గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సహస్ర ఘటాభిషేకం జరుగుతుందని ఈవో తెలిపారు. ఏసీపీ కాళిదాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాల వద్ద ఇటీవల జరుగుతున్న దుర్ఘటనలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ, మంచి నీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, పార్కింగ్ ఏర్పాట్లు, నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు, ఆర్టీసీ బస్సుల కేటాయింపుపై అధికారులతో ఈవో శోభారాణి సమీక్షించారు. ఈ సమావేశంలో జీవీఎంసీ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజనీరు శిరీషా గాయత్రి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్‌షిప్‌లు అందుకున్న విద్యార్థులతో ఇకార్వో అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా తదితరులు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన రైల్వే ఉద్యోగుల పిల్లలకు తూర్పుకోస్తారైల్వే మహిళా సంక్షేమ సంఘం, వాల్తేరు డివిజన్ (ఇకార్వో) స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసింది. సోమవారం పోర్టు సాగరమాల కన్వెన్షన్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇకార్వో నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన ఉద్యోగులకు అవార్డులతో సత్కరించారు. వాల్తేరు డివిజన్ మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బొహ్రా ముఖ్య అతిథిగా హాజరై 340 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఇంజనీరింగ్, మెడిసిన్, ఐఐటీ ప్రవేశ పరీక్షలలో ర్యాంకులు పొందినవారికి కూడా ప్రోత్సాహకాలు అందజేసి అభినందించారు. ఆమె మాట్లాడుతూ రైల్వే ఉద్యోగుల పిల్లల్లోని విద్యా నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు స్కాలర్‌షిప్‌లు దోహదపడతాయన్నారు. ఉన్నత శిఖరాలకు చేరేందుకు పట్టుదలతో యువత కృషి చేయాలని సూచించారు. ఇకార్వో ప్రతినిధులు గాయత్రి శాంతారామ్, అంకితా శర్మ తదితరులు పాల్గొన్నారు.

వందేమాతరం స్మారకంగా...



మొక్క నాటుతున్న డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వందేమాతరం దేశభక్తి గీతం 150 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా వాల్తేరు డివిజన్ రైల్వే కాలనీలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా నగరంలోని డాల్ఫిన్ నోస్ రైల్వే కాలనీలో డీఆర్ఎం లలిత్ బొహ్రా సోమవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ఐక్యత, మాతృభూమిపై గౌరవం పెంచే వందేమాతరం జాతీయ దేశభక్తి గీతం గొప్పతనాన్ని భవిష్యత్తు తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో వాల్తేరు డివిజన్ వ్యాప్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామని పేర్కొన్నారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన వాతావరణం, వందేమాతరం గీతంపై అంకితభావం సూచిస్తాయని అభిప్రాయపడ్డారు. ఏడీఆర్ఎంలు ఈ.శాంతరామ్, కె.రామారావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తపాలా క్రీడాకారుల టేబుల్ టెన్నిస్ టోర్నీ ప్రారంభం





క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి, టేబుల్ టెన్నిస్ ప్రారంభమ్యాచ్‌కు ముందు ఆమె సరదాగా ఆడుతున్న దృశ్యం

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తపాల శాఖ ఆధ్వర్యంలో 40వ అఖిల భారత టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నీ సోమవారం ఎస్3 స్పోర్ట్స్ ఎరీనాలో ప్రారంభమయింది. ఏపీతో పాటు ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, అసోం, ఝార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాల నుంచి సుమారు 129 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముందుగా క్రీడా వందనాన్ని ముఖ్య అతిథి ఏపీ సర్కిల్ చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి స్వీకరించారు. అనంతరం అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, విశాఖ పోస్టు మాస్టర్ జనరల్ వీఎస్.జయశంకర్ జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ క్రీడలు శారీరక పటుత్వాన్ని పెంపొందించడమే కాకుండా స్నేహభావం నెలకొల్పుతాయన్నారు. ఇలాంటి పోటీల్లో పాల్గొనడం జ్ఞాపకంగా నిలుస్తుందన్నారు. క్రమశిక్షణ, క్రీడా స్ఫూర్తితో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. అర్జున అవార్డీ నీలంశెట్టి లక్ష్మి మాట్లాడుతూ దేశానికి గొప్ప ఖ్యాతినందించే అవకాశం క్రీడల్లో లభిస్తుందన్నారు. అనంతరం ప్రత్యేక పోస్టల్ కవర్‌ను చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ సంతోష్‌కుమార్ నేథా, విశాఖ డివిజన్ సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్ ఎన్‌వీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ విజేత ప్రభుత్వ మహిళా కళాశాల



ప్రభుత్వ మహిళా కళాశాల జట్టుతో అతిథులు

విశాఖపట్నం స్పోర్ట్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏయూ అంతర్ కళాశాలల మహిళల వాలీబాల్ టోర్నీలో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్) చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఏయూ సిల్వర్ జూబ్లీ క్రీడా మైదానంలో సోమవారం జరిగిన ఈ టోర్నీలో గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ స్థానం, ఏయూ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ తృతీయ స్థానం దక్కించుకున్నాయి. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. వ్యాయామ విద్య క్రీడా శాస్త్రం సంచాలకులు ఆచార్య ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, ప్రభుత్వ మహిళా కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ హెడ్ డాక్టర్ కిరణ్మయి, వివిధ కళాశాలల ఫిజికల్ డైరక్టర్లు డాక్టర్ గోపీకృష్ణ, డాక్టర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోర్‌వెల్‌కు మరమ్మతులు

కంచరపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 55వ వార్డు పరిధి గంగన్ననగర్‌లో ఏడాదిగా మరమ్మతులకు గురైన బోర్‌వెల్‌ను టీడీపీ నాయకుల చొరవతో సోమవారం వినియోగంలోకి వచ్చింది. జోగారావు నగర్, గంగన్ననగర్‌లో ప్రజల మంచినీటి అవసరాలు తీర్చేది ఈ బోర్‌వెల్ కావడంతో సోమవారం మరమ్మతులు చేయించారు. వార్డు టీడీపీ అధ్యక్షుడు బండి రంజీత్ దృష్టికి స్థానికులు సమస్యను తీసుకురాగా అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. మరమ్మతుల ను మాజీ కార్పొరేటర్ ఎన్.అప్పారావు, ప్రధాన కార్యదర్శి రమణ అప్పారావు పర్యవేక్షించారు.

ఎమ్మెల్యే వినతుల స్వీకరణ



బీజేపీ కార్యాలయంలో ప్రజల దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార బాలయ్యశాస్త్రి లే అవుట్‌లో గల బిజెపి ఉత్తర నియోజకవర్గం కార్యాలయంలో ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సోమవారం ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. నియోజకవర్గంలో పలు వార్డుల ప్రజలు తమ సమస్యలను తెలుపుతూ దరఖాస్తులను ఎమ్మెల్యేకు అందచేశారు. దరఖాస్తులను పరిశీలించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

తెలుగు సాహిత్యంలో ప్రచండ భాస్కరుడు బ్రౌన్

» బ్రౌన్ జయంతి వేడుకల్లో వక్తల ప్రశంస



సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆచార్యులు, విద్యార్థులు

సీతంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో ప్రచండ భాస్కరుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ అని వక్తలు శ్లాఘించారు. ఆంధ్ర విశ్వ కళాపరిషత్ తెలుగు శాఖలో బ్రౌన్ 227వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, తెలుగు శాఖాధిపతి జర్రా అప్పారావు తదితరులు బ్రౌన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు అధ్యక్షత వహించిన ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ ఎన్నో గ్రంథాలను భద్రపరచిన బ్రౌన్ పేదల పెన్నిధి అన్నారు. ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ తెలుగు భాషకు ఆయన చేసిన సేవ అనన్య సామాన్యమన్నారు. పేదలకు ఉచిత విద్య, భోజన వసతి కల్పించిన ఆదర్శమూర్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, ఆచార్య గజ్జా యోహాను బాబు, డాక్టర్ దామెర వెంకట సూర్యారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, పి.స్నేహలత, బి.ఆశ వందన, డాక్టర్ పులపర్తి శ్రీనివాసరావు, డాక్టర్ మురారి నాగ కృష్ణవేణి, డాక్టర్ మొండ్రు దాసు, డాక్టర్ మేకా ప్రతాప్, డాక్టర్ బీర సూర్యనారాయణ, డాక్టర్ లోపింటి గిరీష్, డాక్టర్ రాజులపాటి శివయ్య, విద్యార్థులు, పరిశోధకులు, సాహితీవేత్తలు, భాషాభిమానులు పాల్గొన్నారు.

పలువురు సీఐలకు పోస్టింగ్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం రేంజ్‌లో పలువురు సీఐలకు బదిలీలు/పోస్టింగ్స్ ఇస్తూ డీఐజీ గోపినాథ్ జట్టీ ఉత్తర్వులు జారీచేశారు. విజయనగరం జిల్లా డీసీఆర్‌బీలో ఉన్న బొడ్డేపల్లి సుధాకర్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి సర్కిల్‌కు బదిలీచేసి, అతని స్థానంలో విశాఖ రేంజ్‌లోని కె.కుమార్‌స్వామిని నియమించారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న బి.నారీమణికి శ్రీకాకుళం మహిళా పోలీస్ సర్కిల్‌లో పోస్టింగ్ ఇచ్చి, అక్కడ పనిచేస్తున్న వానపల్లి రామారావును శ్రీకాకుళం ట్రాఫిక్ సర్కిల్‌కు బదిలీచేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న ఎస్.లక్ష్మణరావుకు అల్లూరి జిల్లా ఎన్‌డీపీఎస్ టాస్క్‌ఫోర్స్ సీఐగా పోస్టింగ్ ఇచ్చి, అక్కడి సీఐ సువ్వారి రామును రేంజ్ వీఆర్‌కు, అచ్యుతాపురం యూపీఎస్ సీఐ నమ్మి గణేష్‌ను రేంజ్‌కు అటాచ్ చేశారు. రేంజ్ వీఆర్‌లో ఉన్న కంది నీలిమను అనకాపల్లి జిల్లా మహిళా పోలీస్ సర్కిల్‌లో నియమించి, అక్కడ పనిచేస్తున్న ఆర్వీఎస్ఎస్ చంద్రశేఖరరావును అచ్యుతాపురం యూపీఎస్‌కు బదిలీ చేశారు.

ఆశ వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర కమిటీని సోమవారం ప్రకటించారు. కమిటీ అధ్యక్షురాలిగా జి.రమణకుమారి (నంద్యాల), ప్రధాన కార్యదర్శిగా కె.ధనలక్ష్మి (అమరావతి), కోశాధికారిగా ఎ.కమల (ఎన్టీఆర్ జిల్లా), ఉపాధ్యక్షులుగా బి.సుధారాణి (విజయనగరం), వి.సత్యవతి (అనకాపల్లి), డి.అన్నపూర్ణ (నెల్లూరు), పి.ధనశ్రీ (కృష్ణా), జి.అమరావతి (శ్రీకాకుళం), ఎం.శివానీ (మన్యం), కె.కల్పన (ప్రకాశం), ఎస్.పద్మ (విశాఖ), ఎం.నాగమణి (అనంతపురం) ఎన్నికయ్యారు. 23 మంది ఆఫీస్ బేరర్స్‌తో పాటు 53 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సీఐటీయూ ప్రతినిధి వీవీ శ్రీనివాసరావు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి: జెడ్సీ

డాబాగార్డెన్స్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న పెట్టుబడిదారుల భాగస్వామ్య సదస్సును విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని జీవీఎంసీ జోనల్ 4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం 31వ వార్డులోని పలు రహదారులు, సుందరీకరణ పనులను ఆకస్మికంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పరిశుభ్రతపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. సిరిపురం నుంచి రైల్వేస్టేషన్ వరకు, సౌజన్య రోడ్డు, బీచ్‌రోడ్డు తదితర ప్రాంతాలు ఎట్టిపరిస్థితుల్లో శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కాలువలలో పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

కుసుమ హరనాథుల లీలా కల్యాణోత్సవం

డాబాగార్డెన్స్ నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహా విశాఖ నగర రాజీవ్‌నగర్‌లోని కుసుమ హరనాథ ఆశ్రమంలో ఆశ్రమ కమిటీ ఆధ్వర్యంలో శివకేశవులకు ప్రీతికరమైన కార్తీకమాసం సందర్భంగా లోకకల్యాణార్థం ప్రేమమూర్తులైన శ్రీ కుసుమ హరనాథుల లీలా కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళధ్వని, వేద మంత్రాలు, సంకీర్తన వ్యాఖ్యానంతో విఘ్నేశ్వరుని పూజ ఆచరించి సాంప్రదాయరీతిలో ప్రేమావతారులైన కుసుమ హరనాథుల కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవానికి వ్యాఖ్యాతగా ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, ఆశ్రమ అధ్యక్షులు బీవీ బాబాజీ, కార్యదర్శి ఆర్‌వీఎస్ రమేష్, కోశాధికారి ఎస్.అన్నాజీరావు, సంయుక్త కార్యదర్శి కే.మంగరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. విచ్చేసినవారందరికీ తీర్థప్రసాదాలను, అన్నప్రసాదం పంపిణీ చేశారు.

సుబ్రహ్మణ్య షష్ఠి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గొండు సీతారాం, కమిటీ ప్రతినిధులు

కంచరపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి ఇందిరానగర్-1 కొండపై కొలువై ఉన్న సుబ్రహ్మణ్య స్వామి జన్మషష్ఠి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్టు ఆలయ గౌరవాధ్యక్షుడు గొండు సీతారాం పేర్కొన్నారు. ఆలయంలో సోమవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో 26న జరగనున్న వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆ రోజున ప్రత్యేక పూజా కార్యక్రమాలు, స్వామివారి ఊరేగింపు జరుగుతుందన్నారు.సమావేశంలో వి.రాజ్‌కుమార్, టి.రంగారావు, మారుతి హరీష్ కుమార్, యశోద కుమార్, కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల సదస్సుకు పక్కాగా ఏర్పాట్లు

... 5వ పేజీ తరువాయి

ఉండాలన్నారు. అతిథులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని విషయాల్లో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. సమీక్షలో రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టీ, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ చందోలు, సత్తిబాబు, లతామాధురి, వెంకటరత్నం, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల డైరెక్టర్లుగా నగర నేతలు

... 5వ పేజీ తరువాయి

కళింగ వైశ్య సంక్షేమం, అభివృద్ధి బోర్డు డైరెక్టర్లుగా పొట్నూరు అప్పారావు (బీజేపీ), తూర్పు నియోజకవర్గానికి చెందిన తంగుడు సంతోష్‌కుమార్ (టీడీపీ), పశ్చిమ నియోజకవర్గానికి చెందిన కోరాడ శ్రీనివాసరావు (టీడీపీ), ఎంఎస్ఎంఈ సంక్షేమం, అభివృద్ధి బోర్డు డైరెక్టర్లుగా నగరానికి చెందిన నీలాపు విజయానందరెడ్డి (బీజేపీ), తూర్పు నియోజకవర్గానికి చెందిన ముగడ రాజారావు (టీడీపీ) నియమితులయ్యారు.

ఐటీ సిటీ

... 5వ పేజీ తరువాయి

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సంస్థకు 160 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.489 కోట్లతో నీటి అడుగున ఆయుధాలు, రక్షణ పరికరాలు తయారుచేసే వ్యవస్థను రూపొందిస్తుంది. అందులో 500 మందికి ఉద్యోగాలు వస్తాయి.

- అనకాపల్లి జిల్లాలో డోజోకో ఇండియా సంస్థకు 150 ఎకరాలు కేటాయించారు. అందులో రూ.1,234 కోట్ల పెట్టుబడితో 1,454 మందికి ఉపాధి కల్పిస్తుంది.
- విశాఖపట్నానికి చెందిన విశ్వనాథ స్పోర్ట్స్ అండ్ కన్వెన్షన్స్ సంస్థకు భవానీ ద్వీపంలో అడ్వెంచర్ థ్రిల్ సిటీ ఏర్పాటుకు భూమి కేటాయించారు. ఈ సంస్థ విశాఖ నుంచి విజయవాడకు తన కార్యకలాపాలు విస్తరించనుంది.
- విశాఖపట్నంలో జీఎస్‌టీ అప్పిలేట్ ట్రిబ్యునల్ బెంచ్ ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. అందులో నిజాయితీగా పనిచేసే అధికారులు, సిబ్బందిని నియమించాలని సూచించారు.
- విశాఖపట్నంలో రియల్‌టైమ్ గవర్నెన్స్, డిజిటల్ పరిపాలన తదితరాల కోసం సింగపూర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారు.

క్లాప్ కాంట్రాక్టర్‌పై కొరడా

... 5వ పేజీ తరువాయి

మూర్తియాదవ్ పూర్తి ఆధారాలను అందజేశారు. వీటన్నింటినీ పరిశీలించిన కమిషనర్ లోడర్లకు వేతనాలు ఇచ్చే బాధ్యత నుంచి క్లాప్ కాంట్రాక్టర్‌ను పక్కనపెట్టారు. ఆ బాధ్యతను ఒక్కో జోన్‌లో ఒక్కో ఎస్ఎల్ఎఫ్‌కు అప్పగించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. అదేవిధంగా ఇకపై జీవీఎంసీలో ఎలాంటి టెండర్‌లో కూడా క్లాప్ కాంట్రాక్టు సంస్థ (శ్రీదుర్గా కన్సల్టెన్సీ సర్వీసెస్) పాల్గొనడానికి అర్హత లేకుండా బ్లాక్ లిస్ట్‌లో చేర్చారు. మరోవైపు క్లాప్ వాహనాల పనితీరుపై కూడా తీవ్రస్థాయిలో విమర్శలు ఉన్నాయి. వాహనాలు తమకు కేటాయించిన ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లడం లేదని, ఒక ట్రిప్పు తిరిగితే మూడు ట్రిప్పులు వేసినట్టు చూపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అందుకే ప్రజలు తమ ఇళ్లలోని చెత్తను రోడ్లపైకి తెచ్చిపడేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై కూడా కమిషనర్ దృష్టిపెట్టారని, త్వరలో క్లాప్ వాహనాల విషయంలో కూడా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.


పెందుర్తి: కాశీవిశ్వేశ్వరుడికి అన్నాభిషేకం


పెదగంట్యాడ: పూజల్లో పాల్గొన్న భక్తులు


అగనంపూడి: శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


కూర్మన్నపాలెం: సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

సర్వం శివోహం!

» కార్తీక మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు
» శివ నామస్మరణతో మార్మోగిన ఆలయాలు

గోపాలపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ఇందిరానగర్‌లోని చంద్రమౌళీశ్వరాయం, నాగేంద్రకాలనీ, చంద్రనగర్, నరవ శివాలయాల్లో ఘనంగా పూజలు జరిగాయి. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సహస్ర దీపాలంకరణ

అక్కిరెడ్డిపాలెం: కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా షీలానగర్‌లో ఉన్న బాలాజీ దివ్యక్షేత్రంలో సహస్ర దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

అగనంపూడి పరిసర ప్రాంతాల్లో..

అగనంపూడి: కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా అగనంపూడి పరిసర ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా పెదమడక, పాత అగనంపూడి, జాబిలి హిల్స్‌లో ఉన్న శివాలయాలకు భక్తులు పోటెత్తారు. అనంతరం ఆలయాల వద్ద మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

'ఉక్కు' శివాయంలో

ఉక్కుటౌన్‌షిప్: కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా స్టీల్‌ప్లాంట్‌లో ఉన్న పురాతన శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు విచ్చేసి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.

స్వామివారికి అన్నాభిషేకం

పెందుర్తి: కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా శివాలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా సరిపల్లిలో ఉన్న స్వయంభు శివాలయంలో స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అలాగే పెందుర్తిలో ఉన్న కాశీవిశ్వేశ్వరుని ఆలయంలో స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు. ప్రశాంతినగర్, పినగాడి, సుజాతనగర్, చినముషిడివాడ, ఉడాకాలనీ, రత్నగిరినగర్, వెంకటాద్రి శిఖరం, రాంపురం తదితర ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పెంటమాంబ అమ్మవారికి చీర, సారె సమర్పణ

పెదగంట్యాడ: కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా పెదగంట్యాడ ప్రాంతంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. నెల్లిముక్కు, బాలచెరువు, దుర్గవానిపాలెం, ప్రియదర్శిని కాలనీ, బీసీరోడ్డు, సీతానగరం, వికాస్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నెల్లిముక్కు గ్రామ ప్రజల ఆచారం ప్రకారం కార్తీక మాసం మూడో సోమవారం పెంటమాంబకు చీర, సారె సమర్పించారు. ఈ సందర్భంగా 14 గ్రామాల పెద్దలు, భక్తులు నెల్లిముక్కు రచ్చబండ వద్దకు చేరుకుని అమ్మవారి సారెను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, పంటలు బాగా పండాలని కోరుతూ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో...

కూర్మన్నపాలెం: కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా పారిశ్రామిక ప్రాంతంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. జీవీఎంసీ 70, 86, 87 వార్డుల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. 86వ వార్డు మాతృశ్రీనగర్ విశ్వేశ్వర దేవాలయంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు, తులసి, తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. కణితి కాళింగుల వీధిలో ఉన్న పంచముఖేశ్వర స్వామి శివాలయంలో సామూహిక పూజలుచేశారు. 87వ వార్డు వడ్లపూడిలో సీతారామలింగేశ్వర స్వామి దేవాలంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 70వ వార్డు చట్టివానిపాలెంలో బాలా త్రిపురసుందరి అమృత లింగేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే ఆటోనగర్ దగ్గర తోకాడ శివాలయంలో దుర్గా మల్లికార్జునస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

వేపగుంట పరిసర ప్రాంతాల్లో

వేపగుంట/ ఎన్ఏడీ.జంక్షన్ : కార్తీక మూడో సోమవారం సందర్భంగా నాయుడుతోట, వేపగుంట, ప్రహ్లాదపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో పూజలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా నాయుడుతోట కృష్ణానగర్ గుడి వీధిలో ఉన్న దుర్గామల్లేశ్వరాయంలో స్పటిక శివలింగానికి చామంతులు, సన్నజాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం సామూహిక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.90వ వార్డు సుసర్ల కాలనీలో ఉన్న చంద్రమౌళేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం ఆలయం లో ఆకాశదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, ఎన్ఏడీ కూడలి, కాకనీనగర్‌లో ఉన్న శివాలయాల్లో పూజలు చేశారు.

కమ్యూనిటీ హాల్‌పై అదనపు అంతస్థు ప్రారంభం

ఎన్.ఎ.డి.జంక్షన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో ఉన్న కమ్యూనిటీ హాలుపై నూతనంగా నిర్మించిన అదనపు అంతస్తును పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని కాలనీల్లో అభివృద్ధి పరుగులు తీస్తోందని అన్నారు. ఇక్కడి కాలనీలోనే దాదాపు సంవత్సరన్నర వ్యవధిలో రూ.4 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయన్నారు. కార్పొరేటర్ బొమ్మిడి రమణ మాట్లాడుతూ తమ వార్డులో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే చూపిన చొరవ అభినందనీయమన్నారు. అంతకముందు విమాన్‌నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు గణబాబుకు సన్మానం చేసి వెంకటేశ్వరుని చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.


కమ్యునిటీ హాలుపై అదనపు అంతస్తును ప్రారంభిస్తున పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు

సమస్యలు పరిష్కరించాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై నాతయ్యపాలెం- అక్కిరెడ్డిపాలెం కాలనీల రోడ్డు క్రాసింగ్ వద్ద జరుగుతున్న ప్రమాదాల నివారణకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసి ఆదుకోవాలని మేయర్ పీలా శ్రీనివాస్‌కు 68 వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష సోమవారం వినతిపత్రం విన్నవించారు. అక్కిరెడ్డిపాలెం, మింది, అప్పన్నకాలనీల్లో శిథిలస్థితిలో ఉన్న ధోబీ ఖానాలను అభివృద్ధి చేసి రజకులను ఆదుకోవాలని, అక్కిరెడ్డిపాలెం కాలనీలో ప్రధాన రహదారి విస్తరణ చేపట్టాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. కాలనీల్లో విద్యార్థులు ఆడుకునేందుకు క్రీడామైదానం, బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లు ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఈ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని మేయర్ హామీ ఇచ్చినట్టు గుడివాడ లతీశ్ తెలిపారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

» ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ

అగనంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ సూచించారు. ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎం) కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి కమిటీ ఆర్థిక సాయంతో గర్భిణులకు ప్రోటీన్ పౌడర్, ఐరన్ టానిక్‌లు, పండ్లను సూపరింటెండెంట్ చేతుల మీదుగా సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్యం కోసం కమిటీ సభ్యులు అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిస్తే భావితరాలకు బంగారు భవిష్యత్తును అందించగలమని కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి అన్నారు. గాజువాక ఆదిత్య కళాశాల ఎన్ఎస్ఎస్ బృందం నిర్వహిస్తున్న సేవా శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులు తుంగ్లాంలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.ప్రదీప్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచరూ!

» కాంట్రాక్టు లేబర్ యూనియన్ కార్యదర్శి గొలగాని అప్పారావు

అక్కిరెడ్డిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పనిగంటలు పెంచడంలో చూపుతున్న శ్రద్ధ, శ్రమకు తగిన వేతనం చెల్లించడంలోను, ఇతర సదుపాయాలు కల్పించడంలో చూపకపోవడం విచారకరమని జీవీఎంసీ కాంట్రాక్టు లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొలగాని అప్పారావు అన్నారు. జగ్గయ్యపాలెంలో సోమవారం నిర్వహించిన పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు శ్రమించే పారిశుధ్య కార్మికులకు సరైన వేతనాలు, సెలవులు, భద్రతా పరికరాలు వంట సదుపాయాలు కల్పించకపోవడం తగదన్నారు.

జనవరి 3, 4 తేదీల్లో అరకు చలి ఉత్సవాలు

పాడేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అరకులోయ చలి ఉత్సవాలు జనవరి 3, 4 తేదీల్లో నిర్వహించే అవకాశం ఉందని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అరకు చలి ఉత్సవాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చలి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు కృషిచేయాలన్నారు. తొలిరోజు (జనవరి 3న) సాంస్కృతిక కార్యక్రమాలు, చిత్రలేఖనం పోటీలు ఉంటాయన్నారు. రెండో రోజు (4న) సైక్లింగ్, లేజర్ షో, ఫ్లవర్ షో, గిరిజన సంప్రదాయ ప్రదర్శనలు, దేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గిరిజన కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

13న 'విక్రయిత అభివృద్ధి ప్రోగ్రాం'

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తలకు 'విక్రయిత అభివృద్ధి ప్రోగ్రాంను' ఈనెల 13న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బొండా తౌడన్న, బయ్యే మల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఈ ప్రోగ్రామ్‌ను ఎల్ అండ్ డీసీ ఆడిటోరియంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

జాతీయ కుడో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

అగనంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కుడో పోటీల్లో ఈ-మర్రిపాలెం ఏబీఎస్ విద్యార్థులు తనుజాశ్రీ, షణ్ముఖ్ కాంస్య పతకాలను సాధించారని పాఠశాల వ్యవస్థాపకుడు కొండయ్య, ప్రిన్సిపాల్ పద్మజాదీపక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు సోమవారం విద్యార్థులను అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సత్తా చాటడం ఆనందంగా ఉన్నాదని తెలిపారు. జాతీయ స్థాయిలో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ సాలాపు ఈశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉక్కు' శివాలయంలో 17న భక్తులకు అనుమతి

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ పురాతన శివాలయంలో పూజలు చేయడానికి వచ్చే భక్తుల కోసం 17వ తేదీన ఉక్కు యాజమాన్యం ప్రత్యేక అనుమతులు ఇచ్చిందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఏటా కార్తీకమాసంతో బయత ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు యాజమాన్యం అనుమతి ఇస్తోందని, ఈ క్రమంలో ఈ ఏడాది కూడా ఇచ్చిందని తెలిపారు.

గంగవరంలో నిత్యాన్నదానం ప్రారంభం

పెదగంట్యాడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 64వవార్డు గంగవరం గ్రామంలో అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం నిత్యాన్నదాన కార్యక్రమం ప్రారంభమయింది. 41 రోజుల పాటు ఈ కార్యక్రమంలో జరగనున్నదని, అయ్యప్ప, భవానీ, హనుమాన్ మాలధారణ భక్తులకు అన్నదానం చేస్తున్నట్టు నిర్వహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. మాల ధారణ నుంచి 41 రోజులవరకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆహార పానీయాలు సరఫరా చేస్తున్నామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. గంగవరం, పల్లిపాలెం, జాలరి పల్లిపాలెం, చినపాలెం, సత్యనారాయణ పురం, వెంకటన్నపాలెం గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


నిత్యాన్నదానం ప్రారంభిస్తున్న భక్తులు

గోతులమయంగా సర్వీస్ రోడ్డు

పెందుర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అనకాపలి-ఆనందపురం నేషనల్ హైవే బైపాస్ రోడ్డు సరిపల్లి ఆర్‌వోబీ బ్రిడ్జి సర్వీస్ రోడ్డు గుంతలమయంగా మారింది. ఇక్కడి సర్వీస్ రోడ్డు మలుపులో రహదారపై భారీ గుంత ఏర్పడడంతో వాహనదారులు భయపడుతున్నారు. దీనికి తోడు నీరు ఈ గుంతలో నిల్వ ఉండిపోవడంతో మరింత ఛిద్రంగా మారింది. పాత పెందుర్తి హైవేకు సమీపంలో ఉన్న చెరువు నిండిపోవడంతో పల్లపు ప్రాంతానికి నీరు పారుతూ, ఈ గుంతలోకి చేరుతోంది. రోడ్డుపై ప్రయాణం చేసే సమయంలో నీటితో నిండిపోయిన ఈ గుంతలోతు అంచనా తెలియకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


సర్వీస్ రోడ్డులో ఏర్పడ్డ గుంత

వివాహిత అదృశ్యం పై కేసు నమోదు

కూర్మన్నపాలెం,నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివాహిత అదృశ్యమైన సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగింది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 87 వార్డు శ్రీ గణేశ్ నగర్‌లో నివసిస్తున్న ఎం.స్తుతి అఫీజా (30) 20 రోజులుగా కనిపించడం లేదని ఆమె సోదరుడు ప్రశాంత్ సోమవారం ఫిర్యాదు చేశాడు. శ్రీకాకుళానికి చెందిన అఫీజా తన భర్తలో గొడవ కారణంగా ఏడాది నుంచి తన సోదరుడి ఇంటిలోనే ఉంటోంది. అక్టోబరు 20న టైలరింగ్ నేర్చుకుంటానని ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో తమ బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకి లభించలేదు. దీంతో దువ్వాడ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఎం.స్తుతి అఫీజా(ఫైల్)

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

» 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్

అగనంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పేర్కొన్నారు. పాత అగనంపూడి, శనివాడ ప్రాంతాల్లో ఆయన సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా జనరల్ ఆస్పత్రి రహదారిలో కల్వర్టు, పాత అగనంపూడి ప్రభుత్వ పాఠశాల వద్ద కల్వర్టు పనులకు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే శనివాడలో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి అంచనాలు రూపొందించాలని సూచించారు. అనంతరం నివాసితులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.

'స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో తరలింపు నిలిపివేయాలి'

కూర్మన్నపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ ఆర్‌టీసీ డిపోను తరలింపు ప్రక్రియను తక్షణమే నిలపివేయాలని ఎస్ఎంయూ ఆధ్వర్యంలో సోమవారం 74వ రోజు రిలే నిరాహార దీక్షలు జరిగాయి. ఈ సందర్భంగా ఎస్ఎంయూ రాష్ట్ర కోశాధికారి పీవీవీ మోహన్ మాట్లాడుతూ ఉక్కు యాజమాన్యంతో 33 సంంత్సరాలు స్టీలుసిటీ డిపో లీజు ముగిసింది. ఇటీవల ఆర్‌టీసీ యాజమాన్యానికి ఉక్కు యాజమాన్యం నోటీసులు జారీ చేసిందని, ప్రస్తుతం భూమి విలువ ఆధారంగా లీజు చెల్లించాలని, వడ్డీలేని సెక్యూరిటీ డిపోజిట్‌గా, సేవా చార్జీలుగా కోట్లాది రూపాయిలు చెల్లించాలని కోరడం తగదన్నారు. లీజును పొడిగించాలని కార్మికుల తరపున ఎస్ఎంయూ కోరుతున్నామని తెలిపారు.



సినిమా గైడ్

- ● **ది గర్ల్ ఫ్రెండ్** : సంగం, లీలామహల్, కామేశ్వరి, ఎస్.వి.సి.గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం), ఎస్.వి.సి.సీతారామయ్య (పరవాడ),నటరాజ్-2 (పెందుర్తి).
- ● **మాస్ జాతర** : జగదాంబ, శరత్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- ● **జటాధర** : శారదా, శ్రీకన్య
- ● **బ్యాడ్ ల్యాండ్స్ / ఫెనిక్స్** : రమాదేవి
- ● **డూడ్** : శ్రీరామా, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), శ్రీకన్య (గాజువాక)
- ● **క్రాంప్** : వెంకటేశ్వర-1,

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 20, టమాటా 26, వంకాయలు (తెలుపు) 50, వంకాయలు (నలుపు) 66, బెండకాయలు 54, పచ్చిమిర్చి 40, కాకరకాయలు 54, బీరకాయలు 60, ఆనపకాయ 34, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 24, క్యారెట్ 58, దొండకాయలు 50, బంగాళదుంపలు 19, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 68, అల్లం (పాతది) 64, బరబాటి 50, ముల్లంగి 30, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 54, దోసకాయలు 40, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 38, బీన్స్ (పెన్సిల్) 70, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు36, కంద 46, దేముడుచిక్కుడు 68, గోరు చిక్కుడు 42, కూర పెండలం 36, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండ ఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 50.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

మేహాద్రిగెడ్డ రిజర్వాయర్‌కు విద్యుత్ వెలుగులు


లైట్ల కాంతిలో వెగిలిపోతున్న మేహాద్రి గెడ్డ

గోపాలపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ స్పిల్‌వేకు ఎట్టకేలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. చాలా ఏళ్ల నుంచి స్పిల్‌వేపై ఉన్న విద్యుత్ దీపాలు వెలగలేదు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో రాత్రివేళలో రిజర్వాయర్ గేట్లు ఎత్తే సమయంలో సిబ్బంది ఇబ్బంది పడేవారు. ఇటీవల తుఫాన్ సంభవించిన సమయంలో రిజర్వాయర్ గేట్లు తరచూ ఎత్తాల్సి వచ్చింది. దీంతో మున్ముందు ఇలాంటి ఇబ్బంది తలెత్తకుండా ముందు జాగ్రత్తగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. విద్యుత్ దీపాలు కాంతులీనుతూ సుందరంగా కనిపిస్తున్నాయి.

'విజ్ఞాన్' అధ్యాపకులకు అవార్డులు

అగనంపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ విజన్ సంస్థ 'భారత్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు 2025'కు విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు ఎం.శిరిషారాణి, దాసరి మనేంద్ర సాయి, పి. విజయభారతి, కే. స్వర్ణలత, గండి నేతాజీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం విజ్ఞాన్ ప్రతినిధుల చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నారు. పరిశోధనా రంగంలో విజ్ఞాన్ అధ్యాపకులు చేస్తున్న కృషిని గుర్తించి అవార్డులు అందించడం హర్షనీయమని ప్రిన్సిపాల్ అరుంధతి అన్నారు. భవిష్యత్తులో మరిన్ని అవార్డులు సాధించాలని ఆమె ఆకాంక్షించారు. అవార్డులు సాధించిన వారిని అధ్యాపకులు అభినందించారు.

తెన్నేటి విశ్వనాథం సేవలు అజరామరం

» నివాళి అర్పించిన ఉక్కు కార్మిక సంఘాల నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం పోరాడిన యోధుడు తెన్నేటి విశ్వనాథం అని ఉక్కు కార్మిక సంఘ నాయకులు పేర్కొన్నారు. స్వాతంత్ర సమరయోధుడు, మాజీ ఎంపీ తేన్నేటి విశ్వనాధం వర్ధంతిని ఉక్కు తెన్నేటి పార్కులో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం విశాఖలో ఏర్పాటు చేసే విధంగా తెన్నేటి ఎనలేని పోరాటాలు చేశారన్నారు. ఆయన చేసిన కృషిని ఎన్నటికి మరువలేమని అన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు యూనియన్, సీఐటీయూ, ఇంటక్ ప్రతినిధులు పాల్గొన్నారు.


తెన్నేటి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

'విద్రోహ దినాన్ని' జయప్రదం చేయండి

» పీఎఫ్ జిల్లా సంఘం కార్యదర్శి ఎస్‌కే హుస్సేన్

మల్కాపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెన్షన్‌దారులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని నిరసిస్తూ ఈనెల 17న ఎన్ఏడీ కొత్తరోడ్డుకు సమీపంలో ఉన్న పీఎఫ్ కార్యాయలం వద్ద జరుగుతున్న విద్రోహ దినాన్ని విజయవంతం చేయాలని జిల్లా పీఎఫ్ సంఘం కార్యదర్శి ఎస్‌కే.హుస్సేన్ పేర్కొన్నారు. మల్కాపురం సీఐటీయూ కార్యాలయంలో సోమవారం జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా పీఎఫ్ కోసం పోరాడుతున్నా ఒక్కరూ పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. అలాగే షిప్ యార్డుకు మినీ రత్న హోదా వచ్చిన నేపథ్యంలో వేతన సవరణ చేసిన సమయంలో పెన్షన్‌దారులకు ఇచ్చిన హామీని షిప్‌యార్డు యాజమాన్యం నిలబెట్టుకోవాలని కోరారు. మినీరత్న వస్తే రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సదుపాయం కల్పిస్తామని ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి సంఘం ప్రతినిధి నూకరాజు అధ్యక్షత వహించగా పలువురు రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రం చిరంజీవ

▸ హీరో రాజ్ తరుణ్, దర్శకుడు అభి

సిరిపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చిరంజీవ సినిమా కుటుంబసమేతంగా చూడదగ్గ చిత్రమని హీరో రాజ్ తరుణ్ అన్నారు. చిత్ర విజయోత్సవాన్ని సోమవారం బీచ్‌రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు అభినయకృష్ణతో కలసి మీడియాతో మాట్లాడుతూ చిరంజీవ సినిమా ఈ నెల7న ఆహాలో రిలీజ్ అయిందన్నారు. అంతా కష్టపడి పనిచేశామని, విజయంతో ఆనందంగా ఉందన్నారు దర్శకుడు అభినయ కృష్ణ మాట్లాడుతూ జబర్దస్త్ స్కిట్స్‌లో కొత్తదనం ఉండేలా చూసుకున్నానని, చిరంజీవతో దర్శకుడిగా ప్రయత్నం చేశానన్నారు.



మాట్లాడుతున్న హీరో రాజ్‌తరుణ్, దర్శకుడు అభి

అప్పన్న సన్నిధిలో హీరో రాజ్‌తరుణ్

సింహాచలం: వరాహలక్ష్మీనృసింహస్వామిని నటుడు రాజ్‌తరుణ్, దర్శకుడు అభి దర్శించుకున్నారు. వారికి పీఆర్వోఅప్పలనాయుడు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకున్న తరువాత అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి దర్శనం తరువాత వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌తరుణ్ మాట్లాడుతూ ఇప్పటివరకు 22 సినిమాల్లో నటించానని, ప్రస్తుతం రాశీసింగ్ కథానాయికగా 'పంచమీనార్' సినిమా ఈనెల 21న విడుదలవుతుందనానరు. పూర్తి హాస్యభరిత చిత్రమన్నారు.

నేడు బీచ్‌రోడ్డులో యూనిటీ మార్చ్: ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150 జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం బీచ్‌రోడ్డులో యూనిటీ మార్చ్ నిర్వహించనున్నట్టు లోక్‌సభ సభ్యుడు ఎం.శ్రీభరత్ తెలిపారు. లాసన్స్‌బేకాలనీలోని పార్లమెంటు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూనిటీ మార్చ్‌లో యువజన సంఘాలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. నగర యువత పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 17న గాజువాకలోనూ యూనిటీ మార్చ్ నిర్వహిస్తామన్నారు. వల్లభాయ్‌పటేల్ గొప్ప స్వాతంత్ర్యసమరయోధుడని, స్వాతంత్ర్యానంతరం దేశవ్యాప్త ఐక్యతను సాధించిన ధీరోదాత్తుడని శ్లాఘించారు. కాంగ్రెస్ పాలనలో ఆయనకు గుర్తింపు రాలేదని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రపంచంలోనే ఎత్తైన పటేల్ విగ్రహం గుజరాత్‌లో ఏర్పాటుచేశారన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, మై భారత్ డిప్యూటీ డైరెక్టర్ జి.మహేశ్వరరావు, యూనిటీ మార్చ్ సమన్వయకర్త ఎస్.ధనేశ్వర రెడ్డి, క్రీడామంత్రిత్వ శాఖ సలహా కమిటీ మాజీ సభ్యుడు కాండ్రేగుల వెంకటరమణ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

దీర్ఘకాలిక అవసరాలను తీర్చేలా అభివృద్ధి పనులు

▸ సీఐఐ సదస్సు ఏర్పాట్ల పరిశీలనలో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న పెట్టుబడిదారుల భాగస్వామ్యసదస్సు కోసం నగరంలో అభివృద్ధి, సుందరీకరణ పనులను దీర్ఘకాలిక అవసరాలు తీర్చేలా చేపడుతున్నామని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ వివరించారు.జీవీఎంసీ ఆధ్వర్యం చేపడుతున్న పనులను ఆర్కేబీచ్, సిరిపురం జంక్ష న్, ఏయూ ఇంజనీరింగ్ మైదానం తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన పరిశీలించారు. అనం తరం మాట్లాడుతూ సీఐఐ సదస్సు కోసం మూడు నెలలుగా పనులు చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు 9.5 కిలోమీటర్ల తారురోడ్డు నిర్మాణం, 26 కిలోమీటర్ల ఫుట్‌పాత్‌ల మరమ్మతులు, పెయింటింగ్స్, మీడియన్ గ్రిల్స్ రిపేర్లు, పెయింటింగ్‌లు, మీడియన్ గ్రిల్స్ ఏర్పాటు, మ్యూరల్ ఆర్ట్స్, రోడ్‌లేన్ మార్కింగ్‌లు, బస్‌బేల అభివృద్ధి, స్ట్రీట్‌లైటింగ్, సెంటర్‌మీడియన్‌లో మొక్కలు నాటడం, పచ్చదనం అభివృద్ధి చేపట్టామన్నారు. 26 మార్గాల్లో రోడ్లను ఐదు కేటగిరీలుగా విభజించి నిర్మాణం చేపట్టామన్నారు. ఇప్పటివరకు 95 శాతం పనులు జరిగాయన్నారు. నగరానికి మణిహారమైన బీచ్‌రోడ్డుపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. ఇసుక పరిశుభ్రత, కాలువల ద్వారా మురుగునీరు కలవకుండా శాశ్వత పరిష్కారం, అండర్‌గ్రౌండ్ కేబుల్, తాగునీటి పైప్ లైన్లు, కొత్త జంక్షన్ల అభివృద్ధి, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా డివైడర్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. రాత్రి సమయంలో బీచ్ అందాలు ఇనుమడించేలా వెయ్యికేవీ సామర్థ్యం కలిగిన నాలుగుహైమాస్ట్ లైట్లను ఏర్పాటుచేస్తున్నామన్నారు.


ఆర్‌కే బీచ్‌లో అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

ముగిసిన కెనరాబ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహాసభలు

సాగర్‌నగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు అధికారులు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన కెనరాబ్యాంక్ ఆఫీసర్స్ అసో సియేషన్ జనరల్ సెక్రటరీ కె.రవికుమార్ పిలుపునిచ్చారు. సాగర్‌నగర్ సమీపంలోని రాడిసన్‌బ్లూ రిసార్ట్‌లో మూడురోజులుగా జరుగుతున్న కెనరాబ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ 20వ త్రైవార్షిక జాతీయ మహాసభల ముగింపోత్సవంలో ఆయన సోమవారం మాట్లాడారు. ఏఐ టెక్నాలజీ తీసుకురానున్న మార్పులకు అంతా సిద్ధం కావాలన్నారు. బ్యాంకు అధికారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై చర్చించి, 100 తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ్యులంతా ఆమోదించారు. ప్రభుత్వ రంగ బ్యాం కుల ప్రైవేటీకరణ ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం నూతన జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా మరల కె.రవికుమార్, అధ్యక్షుడిగా రాజీవ్‌నిగం, చైర్మన్‌గా జాకబ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గానికి సభ్యులు అభినందనలు తెలిపారు. మహాసభలను విజయవంతంగా నిర్వహించిన రిసప్షెన్ కమిటీ చైర్మన్ రమాప్రసాద్‌ను కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమానికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి బ్యాంకు అధికారులు హాజరయ్యారు.


కెనరాబ్యాంకు ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యుల విజయదరహాసం

13 నుంచి ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ తరగతులు రద్దు

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాల మైదానం వేదికగా పార్టనర్‌షిప్ సమ్మిట్-2025 జరగనున్న నేపథ్యంలో ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం నుంచి 15 వరకు ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు తరగతులను రద్దుచేస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక అనుమతి ఇస్తున్నామని, వారు గుర్తింపు కార్డులను చూపి మద్దిలపాలెం గేటు, పోలమాంబ ఆలయం పక్కనున్న గేటు ద్వారా బయటకు వెళ్లవచ్చన్నారు.

గుర్తింపు కార్డులు ధరించాలి

భద్రతను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా విద్యార్థులు, పరిశోధకులు, బోధన ,బోధనేతర సిబ్బంది విధుల్లో తప్పనిసరిగా గుర్తింపు కార్డులను ధరించాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు ఉత్తర్వులు జారీచేశారు. ధరించని వారిని ఏయూ ప్రాంగణంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు తమ పరిధిలోని విద్యార్థులు, పరిశోధకులు, ఉద్యోగులు విశ్వవిద్యాలయ పనివేళల్లో తప్పనిసరిగా గుర్తింపు కార్డులను ధరించేలా చూడాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

18 నుంచి మిల్లెట్ వర్క్‌షాప్


వెంకోజీపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యుయర్స్ ఆఫ్ ఇండియా (ఎలీప్) ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి మూడు రోజులు హ్యాండ్స్-ఆన్ మిల్లెట్ వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఏలీప్ విశాఖపట్నం అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. 15వ వార్డు డాక్టర్స్ కాలనీలోని ఎలీప్ సంస్థలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు వర్క్‌షాప్ కొనసాగుతుందన్నారు. మిల్లెట్లతో పోషక విలువలతో కూడిన వంటకాలను తయారు చేయడంపై శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 63014 41183 నంబరులో సంప్రదించాలన్నారు.

12న జిల్లాకు రానున్న మాదిగ కార్పొరేషన్ చైర్మన్

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఈ నెల 12 నుంచి 14 వరకు జిల్లాలో పర్యటించ నున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా 11వ తేదీన విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 12న ఎంవీపీ కాలనీలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పీఎస్ నాయుడు

విశాఖపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది పీఎస్.నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీచేశారు. బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి మూడేళ్లపాటు పదవిలో ఉంటారు. రాష్ట్ర విభజన తరువాత 2016 నుంచి 2021 వరకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సేవలందించిన పీఎస్ నాయుడు తెలుగుదేశం పార్టీలో జిల్లా, రాష్ట్ర స్థాయి లీగల్‌సెల్ విభాగంలో పలు పదవులు నిర్వహించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన నాయుడ్నివిశాఖ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంకే శ్రీనివాస్, కార్యదర్శి ఎల్‌పీ.నాయుడు బార్‌కౌన్సిల్ వైస్‌చైర్మన్ కృష్ణమోహన్, సభ్యులు పి.నరసింగరావు, కె.రామజోగేశ్వరరావు, బైపా అరుణ్‌కుమార్, సీనియర్ న్యాయవాదులు కేవీ రామమూర్తి, ఎం.రవి అభినందించారు.



పీఎస్.నాయుడు

తండ్రి చేతిలో తనయుడి హత్య

6న విశాలాక్షినగర్‌లో ఘటన

మృతుడి భార్య ఫిర్యాదుతో వెలుగులోకి..

విశాలాక్షినగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన కొడుకు వేధింపులు తాళలేక తండ్రే అతడ్ని హతమార్చాడు. విశాలాక్షినగర్‌లోని చలపతినగర్‌లో ఈనెల 6న ఈ సంఘటన చేసుకోగా మృతుడి భార్య ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చలపతినగర్‌కు చెందిన యెలుదూటి లక్ష్మణరావు కుమారుడు ప్రసాద్ (36)కు విజయవాడలోని కృష్ణలంకకు చెందిన రాజీతో 2019లో వివాహమైంది. ఆ తరువాత కొద్ది రోజులు భార్యతో కలిసి అక్కడే ఉండేవాడు. పనికి వెళ్లకుండా రోజూ తాగి వచ్చి భార్యతో గొడవ పడేవాడు. గత ఏడాది డిసెంబరులో చలపతినగర్‌కి ఒంటరిగా వచ్చేశాడు. ఇక్కడ కూడా మద్యానికి డబ్బులివ్వాలని తల్లిదండ్రులను వేధించేవాడు. ఈనెల 6న లక్ష్మణరావుతో గొడవ పడగా అతను కర్రతో తలపై గట్టిగా కొట్టడంతో మృతిచెందాడు. మృతదేహాన్ని జోడుగుళ్లపాలెం శ్మశానవాటికలో ఖననం చేశారు. మృతుడి భార్య పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయడంతో హత్య కేసుగా నమోదు చేశారు. మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి ఆరేళ్ల కుమార్తె, ఐదేళ్ల కుమారుడు ఉన్నారు.


ప్రసాద్ (ఫైల్ ఫొటో)

క్రైం... crime news

వివాహిత ఆత్మహత్య

▸ భర్తే హత్య చేశాడని మృతురాలి కుటుంబీకుల ఆరోపణ

▸ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు

గోపాలపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భర్త వేధింపులు తాళలేక నవవధువు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన రామకృష్ణానగర్‌లో చోటు చేసుకుంది. పోలీసులు, మృతురాలి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం...

నగరంలోని ఓ ప్రైవేటు బ్యాంకులో లోన్ రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్న వేపాడ దిలీప్‌కుమార్‌తో నర్సీపట్నం ప్రాంతానికి చెందిన శ్యామల(25)కు గత ఏడాది డిసెంబరులో వివాహం జరిగింది. ఆ సమయంలో దిలీప్‌కుమార్‌కు అత్తింటివారు రూ.5 లక్షల కట్నం, 10 తులాల బంగారంతో పాటు ఎకరం భూమి ఇచ్చారు. ఇటీవల దిలీప్‌కుమార్ భూమి పాస్‌బుక్ ఇవ్వాలని, అదనపు కట్నం తేవాలని శ్యామలను వేధిస్తున్నట్టు మృతురాలి కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయని, దిలీప్‌కుమార్ భార్యను దూరంగా ఉంచడంతో పాటు మాట్లాడకుండా వేధిస్తున్నాడని తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శ్యామల ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో బయట ఉన్న భర్తకు ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పి ఫోన్ కట్‌చేసింది. వెంటనే దిలీప్‌కుమార్ ఇంటికి వచ్చి చూడగా తలుపులు వేసి ఉన్నాయి. పలుమార్లు గట్టిగా నెట్టడంతో గడియ ఊడిపోయింది. లోపలికి వెళ్లేసరికి శ్యామల ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉంది. స్థానికుల సాయంతో ఆమెను కిందకు దించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాత్రి 12.30 గంటల సమయంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. శ్యామల మరణంపై తమకు అనుమానాలున్నాయని, అల్లుడి కుటుంబసభ్యులే హత్యచేశారని మృతురాలి తండ్రి నాగేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సీఐ లెంక సన్యాసినాయుడు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, దర్యాప్తు చేస్తున్నారు.


భర్త దిలీప్‌కుమార్‌తో శ్యామల (ఫైల్ ఫొటో)

వ్యక్తి ఆత్మహత్య

గాజువాక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జగ్గు జంక్షన్ వద్ద ఓ వ్యక్తి సోమవారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలావున్నాయి... జగ్గు జంక్షన్ వద్ద ఓ బార్‌లో ఎ.చంద్రమోహన్ (52) వెయిటర్‌గా పనిచేసేవాడు. మద్యానికి బానిసవడంతో పనిలోనుంచి తీసేశారు. దీంతో నిత్యం మద్యం సేవించి తిరుగుతుండేవాడు. సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో బార్ వెనక గల షెడ్డులో ఉరివేసుకున్నట్టు సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడి కుటుంబసభ్యుల వివరాలు తెలియరాలేదు.

టౌన్‌ప్లానింగ్ సిబ్బందిపై దాడికి యత్నం

వేపగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి వెళ్లిన టౌన్ ప్లానింగ్ సిబ్బందిపై నిర్మాణదారుడు దాడికి యత్నించాడు. బ్లేడుతో గాయపరుస్తానంటూ హల్‌చల్ చేశాడు. దీంతో సచివాలయ సిబ్బంది భయంతో పరుగులు తీశారు. ఈ సంఘటన సోమవారం గ్రేటర్ 93వ వార్డు ప్రహ్లాదపురంలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి... ప్రహ్లాదపురం మెయిన్‌రోడ్డుకు ఆనుకుని ఓ వ్యక్తి తన ఇంటిని పూర్తిగా కూలదోసి కొత్తగా నిర్మాణం చేపట్టాడు. ప్లాన్ అప్రూవల్‌కు టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి దరఖాస్తు చేసినప్పటికీ జోన్ 8 టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతించలేదు. అయినప్పటికీ ఇంటి నిర్మాణం చేపట్టడంతో అనేక ఫిర్యాదులు అందాయి. దీంతో పనులు నిలిపివేయాలని అధికారులు నోటీసులు జారీచేసినా పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు సోమవారం ఆ ప్రాంతానికి వెళ్లిన 492 సచివాలయం ప్లానింగ్ కార్యదర్శి షర్మిల, సిబ్బందిపై నిర్మాణదారుడు దాడికి యత్నించాడు. బ్లేడుతో తన చేతిని కోసుకుని ఆ రక్తాన్ని సిబ్బందిపై చల్లాడు. వారిని కూడా గాయపరిచేందుకు యత్నించడంతో సిబ్బంది భయంతో పరుగులు తీశారు. వెంటనే పెందుర్తి పోలీసులు సమాచారం ఇచ్చారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని నిర్మాణదారుడ్ని కట్టడి చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్‌కు కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేస్తామని సచివాలయ సిబ్బంది తెలిపారు. కాగా పోలీసు బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తామని ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి వివరించారు.


సంఘటన స్థలంలో పోలీసులు